



ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
21-2-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 171

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## దేవాదుల మోటర్లు ఎందుకు ఆగిపోయాయి

పంటలు ఎండుతున్నా ఎందుకు పట్టించుకోరు

రైతుభరోసాపై ఇంకా తాత్సారం ఎందుకు

దేవాదుల పంప్‌హౌజ్ వద్ద మీడియాతో హరీష్ రావు

2లో



## లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు దుర్మార్గాలు

నెయ్యిలో జంతువుల కొవ్వు కలసిందని దుష్ప్రచారం

చంద్రబాబు లాగా షాస్ వేసుకుని ఫోటోలు పట్టుకోలే

కూటమి నేతల తీరుపై మండిపడ్డ విపక్షనేత బొత్స

# ఓటమి అలవాటైందా!

## పరాజయాలపై బీఆర్ఎస్ లో రాని మార్పు

## వరుస ఎన్నికల్లో ఓడిపోతున్నా అదే తీరు

ఓడలు బండ్లవుతాయి.. అంటే ఇదేనేమో! తెలంగాణలో బీఆర్ఎస్ ప్రస్తుత పరిస్థితి ఇందుకు అద్దం పడుతుంది. పదేళ్లపాటు తిరుగులేని విజయాలు.. అద్దేలేనంత బలమైన అధికారం. తెలంగాణ అంటేనే బీఆర్ఎస్ అన్న స్థాయి. నుంచి ఇప్పుడు ఉనికి కోసం పోరాడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉద్యమ స్థాయి నుంచి జాతీయ రాజకీయాల వరకు వెళ్లిన ప్రయాణం.. ఒక్కసారిగా పాతాళానికి ఎందుకు పడిపోయింది? ఈ పతనానికి బాధ్యులెవరు? రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం ఇదే చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్ ప్రభుత్వంపై భారీ వ్యతిరేకత ఉందనే భ్రమ

అధినేత ఫాంహౌస్ దాటకపోవడంతో పార్టీపై ప్రభావం

ఇంకా అన్ని వర్గాల ఆమోదం పొందని కేటీఆర్

హరీశ్ రావుకు పరిమితులు విధిస్తుండడంతోనష్టం



(ప్రభాత సూర్య తెలంగాణ బ్యూరో )

ఓటరు నాడిని పసిగట్టడంలో బీఆర్ఎస్ నాయకత్వం వరుసగా విఫలమవుతుండడం.. కార్యకర్తలను ఆందోళనకు గురి చేస్తోంది. తెలంగాణ ఇంటి పార్టీగా గుర్తింపు పొందిన బీఆర్ఎస్.. సొంత ఇంట్లోనే ఎందుకు పరాజయం పాలవుతోందన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి సహజంగా గెలుపు అవకాశాలు ఉన్నప్పటికీ ఓట్ల శాతంలో భారీ వ్యత్యాసం బీఆర్ఎస్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందని అంటున్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తల బలం చెక్కు చెదరకపోయినా, పార్టీకి దూరమైన వర్గాలను తిరిగి ఆకట్టుకోవడంలో మాత్రం బీఆర్ఎస్ అధిష్టానం వైఫల్యం కనిపిస్తోందని విశ్లేషిస్తున్నారు. పైగా.. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిని తేలిగ్గా తీసుకునే ప్రయత్నాలు చేయడమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని పేర్కొంటున్నారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత..

2లో



## మానవ మేధస్సుకు సవాల్ విసిరేలా ఎఐ

ఎఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

హైదరాబాద్‌లో వార్ రూమ్ ఏర్పాటుకు సిద్ధం

ఏఐ రంగంలో అవకాశాలు అందిపుచ్చుకోవాలి

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో సిఎం రేవంత్ రెడ్డి

## భారత పౌరులకు వీసా సర్వీసుల పునరుద్ధరణ

బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20ప్రభాత సూర్య** :ఇండియాతో సంబంధాల పునరుద్ధరణ దిశగా తారిఖ్ రెహ్మాన్

## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం



సిట్ నివేదికపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్

ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం

**అమరావతి,ప్రభాత సూర్య :** తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

2లో



# ట్రంప్ టారిఫ్‌ల కొట్టివేత..

## అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు..

## అధ్యక్షుడు ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ

పన్ను విధింపు అధికారం కాంగ్రెస్‌దే

రాజ్యాంగం అధ్యక్షుడికి ఆ అధికారమివ్వలేదు

టారిఫ్‌లకు ఐఈఈపీఏ చట్టాన్ని వాడటం చెల్లదు

6:3 మెజారిటీతో తీర్పు వెలువరించిన కోర్టు

సిగ్గుచేటైన తీర్పు అంటూ ట్రంప్ మండిపాటు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సుంకాల విషయంలో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆయన ప్రభుత్వం విధించిన విస్తృతమైన ప్రపంచ సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసింది. ఆయన తన అధికార పరిధిని దాటి టారిఫ్‌లను విధించారని ధర్మాసనం సంచలన తీర్పు వెలువరించింది. వైట్ హౌస్ అగ్ర విధాన ప్రాధాన్యతలలో ఒకటైన భారీ సుంకాలు నిరుడు ప్రపంచ వాణిజ్యంలో కొత్త అనిశ్చితిని ప్రవేశపెట్టాయి.

న్యూఢిల్లీ: ట్రంప్ తన అత్యంత ముఖ్యమైన ప్రాధాన్యతలలో ఒకటైన సుంకాలను విధించడానికి ఉపయోగించిన చట్టం ఆయనకు ఆ అధికారాన్ని ఇవ్వలేదని 6-3 మెజారిటీ తీర్పులో అమెరికా అత్యున్నత న్యాయస్థానంలోని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. పన్నులు విధించే అధికారాన్ని ఏ కార్య నిర్వాహక విభాగానికీ అప్పగించలేదని సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ అన్నారు. సుంకాలు, పన్నులు విధించే అధికారం దేశ అత్యున్నత చట్ట సభ అయిన యూఎస్ కాంగ్రెస్‌కే

## డిజిటల్ గవర్నెన్స్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ

తెలంగాణ రైజింగ్'లో ట్రాన్స్ ఫార్మేషన్ టూల్ గా టెక్నాలజీ

కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీ స్ సామాన్యుడికి చేరువ చేయాలన్న తపన

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'

చర్చా కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు




2లో

**న్యూఢిల్లీ,ప్రభాత సూర్య :** ఎఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ను సామాన్యుడికి చేరువ చేసి... డిజిటల్ గవర్నెన్స్ లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చి దిద్దాలన్నదే



## ఆయిల్ పామ్ సాగుతో తెలంగాణ రైతాంగానికి మహర్దశ

ఈ ఏడాది 1.25 లక్షల ఎకరాల్లో సాగుకు రూ.456 కోట్లు కేటాయింపు

పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలి

దేశవ్యాప్తంగా 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలి

కామారెడ్డి జిల్లాలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లో మంత్రి తుమ్మల

**కామారెడ్డి,ప్రభాత సూర్య :** తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుతో రైతాంగానికి మహర్దశ పట్టనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం పాల్వంచమర్రి గ్రామంలో

# డిజిటల్ గవర్నెన్స్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్య సాధనలో టెక్నాలజీని కేవలం ఓ సాఫ్ట్వేర్ గా మాత్రమే కాకుండా... ఓ ట్రాన్స్ ఫార్మేషన్ టూల్ గా మార్చుకుంటున్నామన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రణాళికలను న్యూఢిల్లీ భారత్ మండపంలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో భాగంగా శుక్రవారం 'ఏజెంట్స్ ఆఫ్ ఛేంజ్; ఏఐ ఫర్ గవర్నమెంట్ సర్వీసెస్ అండ్ క్లైమేట్ రెసిలియెన్స్' అంశంపై నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. పౌర సేవలకు టెక్నాలజీని అనుసంధానం చేసి... ప్రభుత్వానికి, పౌరులకు మధ్య ఉండే దూరాన్ని తగ్గించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, ఐకం, ఏఐ ఆధారిత తెలంగాణ డిజిటల్ ఎక్స్ఛేంజ్, భూ భారతి లాంటి విప్లవాత్మక సంస్కరణలు డిజిటల్ గవర్నెన్స్ లో తెలంగాణ బ్రాండ్ ను సుస్థిరం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక ఫలాలను కేవలం ఓ ప్రాంతానికో లేదా వర్గానికో పరిమితం చేయకుండా అందరికీ చేరువ చేసేలా 'ఏజెంటిక్ ఏఐ' వినియోగంపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. టెక్నాలజీని కేవలం గవర్నెన్స్ కు మాత్రమే పరిమితం చేయకుండా వ్యవసాయం, వాతావరణ మార్పులు, ఆరోగ్యం, సుస్థిర నగరాల అభివృద్ధి, క్లీన్ ఎనర్జీ, డిజాస్టర్ మేనేజ్ మెంట్ తదితర రంగాలకూ విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణా అవకాశాల గని.. అపారమైన టాలెంట్ పూల్ మా బలం అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణాలో ఏఐ పరిశోధలు, ఆవిష్కరణలకు ప్రభావశీలమైన టాలెంట్ పూల్ ఉందని తెలిపారు. ఏఐ సమ్మిట్ లో స్వీడెన్ వాణిజ్య ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు.కృత్రిమ మేథ వెల్లువ వల్ల ఎదురయ్యే సవాళ్లను, అది తీసుకువచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మా ప్రభుత్వం ముందే సంసిద్ధమైంది. దానికి తగ్గట్టుగా సాఫ్ట్ వేర్ నిపుణుల నైపుణ్యాలు పెంచే కార్యక్రమాలు ప్రారంభించాం. ఇదిలావుంటే ఏఐ విస్తృతితో ఉద్యోగ విధుల్లో గణనీయమైన మార్పులు వస్తాయి. అందుకు

అవసరమైన సన్నధను మొదలు పెట్టింది మా ప్రభుత్వమే.ఏఐ పరిశోధన కేంద్రాలు, అప్లికేషన్లు, సేవల వల్ల కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. యువత దీనిని అందిపుచ్చుకోవాలి.యువత, వృత్తి నిపుణులు మరింత సృజనాత్మక బాధ్యతలు చేపట్టేందుకు ఏఐ అపారమైన అవకాశాలను సృష్టిస్తుంది.స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ అనేది రెండేళ్లుగా మేం మంత్రంలా జపిస్తున్నాం.ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాల్లో ఏఐ వినియోగం వల్ల లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెరుగుతుంది.

# లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు దుర్మార్గాలు

**అమరావతి,ప్రభాత సూర్య :**చంద్రబాబు దేవదేవుడి ప్రసాదంపై నిందారోపణలు చేశారని.. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని తప్పుడు ప్రచారానికి దిగారని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. శుక్రవారం ఆయన శాసన మండలి మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. తన స్వలాభం కోసం తమ సంస్థలకు నెయ్యి టెండర్లు ఇప్పించుకోవడం కోసం అసత్యాలు చెప్పారన్నారు.సీబీఐ ఇచ్చిన రిపోర్టులో చాలా విషయాలు బయటికి వచ్చాయని.. హెరిటేజ్‌తో ఒప్పందం చేసుకున్న ఇందాపూర్ డెయిరీ నెయ్యిని సరఫరా చేసింది. 2015-19 మధ్య కల్తీ నెయ్యిని సరఫరా చేసినందుకు ఇందాపూర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఇందాపూర్‌ను బ్లాక్ లిస్ట్ నుంచి తప్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు ట్యాంకర్లను వెనక్కి పంపారు. అవే ట్యాంకర్లను దాచి మళ్లీ వినియోగించారు. గోవిందా కూటమి నేతలకు ఇప్పటికైనా మంచి బుద్ధి ప్రసాదించాలని కోరాం. సభలో చర్చించమని కోరామని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

# దేవాదుల మోటర్లు ఎందుకు ఆగిపోయాయి

**వరంగల్,ప్రభాత సూర్య :**అన్నదాతల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. దేవాదుల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు నీరు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. రైతులపై పగబట్టారా..? అంటూ ఫైర్ అయ్యారు. కనీసం కాలువలు కూడా తవ్వలేకపోయారని మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో హరీశ్‌రావు శుక్రవారం పర్యటించారు. దేవన్నపేట పంప్‌హౌస్ దగ్గర దేవాదుల మోటార్లని పరిశీలించాక మీడియాతో మాట్లాడారు. మోటార్లు ఎందుకు ఆగాయంటూ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరిలో నీరు వృథాగా పోతున్నా... దేవన్నపేటలో మూడు మోటార్లు పది రోజులుగా ఎందుకు పని చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో మంత్రులు వచ్చి మోటార్లు ప్రారంభిస్తామని చెప్పి.. చివరకు ప్రారంభించకుండా వెళ్లారని దుయ్యబట్టారు. రైతులపై పగబట్టారా..?, కనీసం కాలువలు కూడా తవ్వలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడు 60వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. దేవాదుల ప్రాజెక్టులో అతి పొడవైన, లోతైన పంప్ హౌస్ దేవన్నపేట అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే దేవాదుల థర్డ్ ఫేస్ పూర్తి చేశామని హరీశ్‌రావు ప్రస్తావించారు. నాడు దేవాదులపై కాంగ్రెస్ చిన్నచూపు చూస్తే... కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు పూర్తి చేశారని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో దేవాదుల ఆయకట్టును 3లక్షల 17వేల ఎకరాలకు పెంచామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# రుమల లడ్డూ కల్తీ వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటనపై ఇప్పటికే సిట్ దర్యాప్తు పూర్తయ్యి నివేదిక సమర్పించిన నేపథ్యంలో.. ఆ నివేదికను సమగ్రంగా అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ అధ్యక్షతన ఈ ఏకసభ్య కమిటీని ఏపీ సర్కార్ నియమించింది. ఈ కమిటీ ప్రధాన బాధ్యత.. సిట్ నివేదికలో పేర్కొన్న అంశాలను పూర్తిగా పరిశీలించడం, దర్యాప్తులో బయటపడ్డ విషయాలను విశ్లేషించడం, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇవ్వడం. ప్రభుత్వం నిర్ణయించిన గడువు ప్రకారం, ఈ ఏకసభ్య కమిటీ 45 రోజుల్లోగా తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. సిట్ నివేదికలో ఉన్న అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి, అవసరమైతే అదనపు వివరాలను సేకరించి.. బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేయనుంది. తిరుమలలో శ్రీవారి లడ్డూ కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా భావిస్తారు.

# ట్రంప్ టారిఫ్‌ల కొట్టివేత..

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలను పక్కనపెట్టడానికి అధ్యక్షుడికి పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని ఉద్దేశించలేదని వారు వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న జడ్జిలు దేశాధ్యక్షుడి నిర్ణయం చట్ట విరుద్ధమని సుంకాలను కొట్టేసింది. కాగా, సుప్రీంకోర్టు తీర్పు గత సంవత్సరం ప్రపంచంలోని దాదాపు ప్రతి దేశం నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై ట్రంప్ విధించిన సుంకాలకు వర్తిస్తుంది.ఇతర దేశాలకు విస్తరించే ముందు మొదట మెక్సికో, కెనడా, చైనాలను లక్ష్యంగా చేసుకుని ఏప్రిల్‌లో విముక్తి దినోత్సవం నాడు సుంకాల విధింపునకు ట్రంప్ శ్రీకారం చుట్టారు. అత్యవసర పరిస్థితికి ప్రతిస్పందనగా వాణిజ్యాన్ని నియంత్రించే అధికారాన్ని అధ్యక్షుడికి ఇచ్చే 1977 చట్టం అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం(ఐఈఈపీఏ) ఉపయోగించి ఈ సుంకాలు సమర్థనీయమేనని ట్రంప్ వాదిస్తూ వచ్చారు.

**తీర్పు అవమానకరం.. ప్రత్యామ్నాయ ప్రణాళిక ఉంది: ట్రంప్**

తాను విదేశాల ఉత్పత్తులపై విధించిన టారిఫ్‌లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు 'అవమానకరం' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. దీనిపై తనకు ప్రత్యామ్నాయ ప్రణాళిక ఉన్నట్టు ఆయన తెలిపారు. కాగా, వివిధ దేశాలకు ట్రంప్ విధించిన అదనపు సుంకాల ద్వారా అమెరికాకు నిరుడు డిసెంబర్ నాటికి



133 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరినట్టు సమాచారం.

**మన వస్తువులకు అడ్డంకులు తొలిగేన**

ఈ తీర్పు ట్రంప్ బాధితులైన వివిధ దేశాలకు వేల కోట్ల డాలర్ల సుంకాల వాపసుకు తలుపులు తెరుస్తుంది. ఈ తీర్పు అమలైతే భారత్‌కు పెద్ద ఉపశమనం కలుగుతుందనడంతో సందేహం లేదు. ముఖ్యంగా దీని ప్రభావం వల్ల యూఎస్ మార్కెట్లో మన వస్తువులకు అడ్డంకులు తొలగవచ్చు. వస్త్ర పరిశ్రమ, ఐటీ, ఇంజనీరింగ్ గూడ్స్, వ్యవసాయ ఉత్పత్తులు, ఆటో కాంపొనెంట్స్, వజ్రాల పరిశ్రమ, ఫార్మా, స్టీల్, కెమికల్స్‌కు ఆర్డర్లు పెరుగుతాయి. విదేశీ పెట్టుబడులు కూడా పెరుగుతాయి. ట్రేడ్ అనిశ్చితి తగ్గితే మార్కెట్లు స్థిరంగా ఉంటాయి.

**'అమెరికా వ్యాపారులు తేలిగ్గా ఊపిరి పీల్చుకోవచ్చు'**

సుప్రీం కోర్టు తీర్పుపై మాజీ ఉపాధ్యక్షుడు, మైక్ పెన్స్ హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పుపై సంతోషాన్ని ప్రకటించిన ఆయన 'ట్రంప్ విధించిన టారిఫ్‌లను విదేశాలు కాదు.. అమెరికా కుటుంబాలు, అమెరికా వ్యాపారాలు చెల్లిస్తున్నాయి. ఈ నిర్ణయంతో అమెరికా కుటుంబాలు, వ్యాపారులు తేలిగ్గా ఊపిరి పీల్చుకోవచ్చు' అని ఆయన సామాజిక మాధ్యమంలో వ్యాఖ్యానించారు. ఈ తీర్పు వల్ల ట్రంప్ ఆర్థిక ఎజెండాకు ముఖ్యమైన అంశంపై గణనీయమైన నష్టాన్ని కలిగించిందని పలువురు ఆర్థిక వేత్తలు వ్యాఖ్యానించారు.

# మానవ మేధస్సుకు సవాల్ విసిరేలా ఏఐ

(మొదటి పేజీ తరువాయి)

**న్యూఢిల్లీ, ప్రభాత సూర్య :**గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చింది. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ విప్లవం నడుస్తోందని, అందులో భాగమే ఏఐ విప్లవమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. ఏఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన వార్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు.. ఏఐ వార్ రూమ్ కోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశం. హైదరాబాద్‌లో ఏఐ వర్సిటీని ఇప్పటికే సకల వసతులతో ఏర్పాటు చేశామని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో ప్రస్తావించారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించ గలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేథస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని వివరించారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని.. కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏఐ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని భారత్ అందిపుచ్చు కోవాలి. ఏఐలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. ప్రతి ఆరు నెలలకోసారి హైదరాబాద్ వంటి ప్రదేశంలో ఏఐ సదస్సులు జరగాలని రేవంత్ అన్నారు. ప్రపంచంలోని టెక్నాలజీ దిగ్గజాలన్నీ ఈ సదస్సుకు వచ్చాయని, ఆలోచనలే మన జీవితాలను మార్చివేస్తాయని చెప్పారు. మనిషి అత్యున్నత ఆవిష్కరణ అయిన ఏఐ ఫలితాలు మన కోసం చూస్తున్నాయి. మనిషి కంటే ఏఐకి ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని సీఎం స్పష్టం చేశారు.

# ఆయిల్ పామ్ సాగుతో తెలంగాణ రైతాంగానికి మహర్దశ

ఉద్యాన ,పట్టు పరిశ్రమ శాఖతో పాటు హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సింగిరెడ్డి బలరాం ఆరున్నర ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, సంప్రదాయ పంటలతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఆయిల్ పామ్ సాగు దీర్ఘకాలిక లాభాలను అందిస్తుందని తెలిపారు. పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే దేశవ్యాప్తంగా సుమారు 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాల్సిన అవసరం ఉందని, ఈ పంట రైతుల కుటుంబాలను ఆర్థికంగా బలపరుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.88 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ఉన్నదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు 32,923 మంది రైతులు 1,05,455 ఎకరాల్లో ఈ పంట సాగును చేపట్టారని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.25 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు రూ.456 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తుండగా, సిద్దిపేట జిల్లా నర్మేట్టలో నిర్మాణం పూర్తయిన ఫ్యాక్టరీ త్వరలో అందుబాటులోకి రానుందని మంత్రి చెప్పారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటలను సాగు చేస్తూ రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ పంట నాలుగు సంవత్సరాల్లో దిగుబడిని ఇవ్వడం ప్రారంభించి 30 నుంచి 40 సంవత్సరాల పాటు ఆదాయం అందిస్తుందని పేర్కొన్నారు.

## భారత పౌరులకు వీసా సర్వీసుల పునరుద్దరణ

సారథ్యంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వం తొలి అడుగు వేసింది. భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది. దీంతో రెండు నెలలుగా నిలిచిపోయిన వీసా సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. బీఎన్‌పీ నేత తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్‌లోని అన్ని వీసా సర్వీసులను త్వరలోనే పునరుద్ధరిస్తున్నట్టు సీనియర్ ఇండియన్ కాన్సులర్ అధికారి న్యూఢిల్లీలో గురువారంనాడు ప్రకటించారు. ఈ క్రమంలో భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది. కొద్దికాలం క్రితం భారత వ్యతిరేక యువనేత షరీఫ్ ఒస్మాన్ హదీ హత్యకు గురికావడం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. హదీ హత్యానంతరం హిందూ మైనారిటీలపై దాడులు, హత్యాకాండలు చోటుచేసుకున్నాయి.

# ఓటమి అలవాటైందా!

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ మాట్లాడుతూ తాము 30కి పైగా స్థానాలు గెలుచుకుంటామని ఆశిస్తే, 17 వచ్చాయని అన్నారు. బీజేపీకి అసలు ఒక్కస్థానం కూడా దక్కలేదని వ్యాఖ్యానించారు. అయితే కేటీఆర్ ఇలా మాట్లాడటం చూసిన వారు మున్సిపల్ ఎన్నికల్లో అపజయాన్ని అంగీకరించేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా లేదని అంటున్నారు. మొత్తం పోటీ చేసిన స్థానాలు కాకుండా, ఆశించిన స్థానాల్లో సగం గెలుచుకోవడం గొప్పగా బీఆర్ఎస్ భావిస్తోందా? అని ప్రశ్నిస్తున్నారు.

**తమ పట్ల వ్యతిరేకతను గుర్తించని నాయకత్వం..**

మున్సిపల్ ఎన్నికలే కాదు.. 2023 ఎన్నికల్లో అధికారం కోల్పోయిన నుంచి నేటి వరకు ఏ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తన ప్రభావం చూపలేకపోతోంది. దీనికి ప్రధాన కారణం ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సరైన రీతిలో పనిచేయకపోవడమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్న భావనపైనే బీఆర్ఎస్ ఉండిపోయిందని అంటున్నారు. బీఆర్ఎస్ నేతలకు ఉన్న వ్యతిరేకతను ప్రజా వ్యతిరేకతగా భావిస్తూ తప్పులో కాలేస్తున్నారా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిని ఆ స్థానంలో చూడటానికి బీఆర్ఎస్ అధిష్టానం ఇప్పటికీ ఇష్టపడటం లేదు. ఈ కారణంగానే ఎక్కువ నష్టపోతున్నట్లు పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

**కేసీఆర్ వ్యవహార శైలితో ఇబ్బంది..**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యవహారశైలి కూడా పార్టీని దెబ్బతీస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2023లో ఎన్నికల అనంతరం ఫాం హౌస్కు వెళ్లిపోయిన కేసీఆర్.. ఇప్పటికీ అక్కడి నుంచి బయటకు రావడంలేదు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను దిశానిర్దేశం చేయాల్సిన కేసీఆర్ తన బాధ్యతలను పూర్తిగా కేటీఆర్, హరీశ్ రావుకు వదిలేశారు. దీనినే అస్త్రంగా మలుచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు కేసీఆర్ ను దూరం చేయడంలో సక్సెస్ అయ్యారని విశ్లేషకులు అంటున్నారు.

**కవిత వ్యాఖ్యలతో నష్టం జరుగుతున్నా..**

సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలను తిప్పికొట్టడంలో విఫలమవుతున్న బీఆర్ఎస్.. సొంత ఇంటిని చక్కబెట్టుకోవడంలో కూడా తడబడుతోందని అంటున్నారు. ప్రధానంగా కేటీఆర్ ను లక్ష్యంగా చేసుకుని కేసీఆర్ కూతురు కవిత చేస్తున్న వ్యాఖ్యలు సైతం పార్టీలో కలకలం రేపుతున్నాయి. దీనివల్ల క్షేత్రస్థాయిలో ప్రజలు కూడా కేసీఆర్ ఇంటి సమస్యను చక్కదిద్దుకోలేని పరిస్థితిలో ఉన్నారని, ఇక తమ సంగతి ఏం చూస్తారన్న భావనకు వచ్చేస్తున్నారని అంటున్నారు. అంతేకాకుండా ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్న వర్గాలు కేసీఆర్ గైర్హాజరీ వల్ల బీజేపీ వైపు మొగ్గు చూపడం కూడా నష్టం చేకూర్చుతోందని పేర్కొంటున్నారు. కేసీఆర్ స్థానంలో కేటీఆర్ ను ఊహించుకునేందుకు ప్రజలు ఇంకా సిద్ధపడటం లేదని, కేటీఆర్ సైతం అందరి ఆమోదం పొందడంలో తడబడుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంలో హరీశ్ రావు సేవలకు పరిమితులు విధించడం వల్ల కూడా బీఆర్ఎస్ కు నష్టం చేస్తుందని అంటున్నారు. మొత్తానికి బీఆర్ఎస్ అధిష్టానం ఆలోచనలో మార్పు వస్తే తప్ప.. ఎన్నికల్లో ఫలితాలు మారే పరిస్థితి కనిపించడం లేదని విశ్లేషిస్తున్నారు.

## సత్యసాయి కళ్యాణ మండపం నిర్మాణానికి
# శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

- ప్రజా ప్రయోజనార్ధనం ● సత్యసాయి కళ్యాణ మండపం నిర్మాణానికి పూర్తి సహకారం
- అభివృద్ధి పనుల శంకుస్థాపనలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్





**గండిపేట్ ప్రభాత సూర్య:** ప్రజల ప్రయోజనార్ధనం సత్యసాయి పరస్పర సహాయక సహకారం పొదుపు సంఘం లిమిటేడ్ చేపట్టే కార్యక్రమాలకు తనవంతు పూర్తి సహకారం ఉంటుందని రాజేంద్రనగర్ శాసన సభ్యుడు టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. ప్రగతి భాటలో పయనిస్తున్న ఆ పొదుపు సంఘం ఆర్థికంగా మరింత ఉన్నతి సాధించాలని కాంక్షిస్తున్నట్లు ఆయన చెప్పారు. గురువారం మార్కండేయనగర్ లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగాణంలో సత్యసాయి పరస్పర సహాయక సహకారం పొదుపు సంఘం ఆర్థిక సహకారంతో నిర్మించ తలపెట్టిన 'సత్యసాయి కళ్యాణ మండపం' అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి లక్ష్యంతో కళ్యాణ మండపం నిర్మించాలని సంఘ పాలకవర్గ 25వ వార్షిక మహా సభలో తీర్మాణం ప్రవేశ పెట్టి ఏకగ్రీవ ఆమోదంతో కావలసిన ఆర్థిక వనరులు సమకూర్చడానికి ముందుకు రావడం సంతోషకరమైన విషయమన్నారు. స్థానికంగా నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలు అత్యధికంగా నివాసం ఉండే మార్కండేయనగర్ లో ప్రస్తుతం దేవాలయాల నిర్వాహణకు చేయుతనిస్తున్న సత్య సాయి పొదుపు సంఘం తలపెట్టిన కళ్యాణ మండపం నిర్మాణం పూర్తి చేసి ఇతర బస్తీలు, కాలనీలకు ఆదర్శనీయంగా నిలవాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. సత్యసాయి పొదుపు సంఘం అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం సలహాదారుడు, ఆలయ కమిటీ అధ్యక్షుడు గద్దె క్రిష్ణ, పొదుపు సంఘం వ్యవస్థాపకుడు, సలహాదారుడు గద్దె యాదగిరి, సలహాదారులు ఏర్వ సత్యనారాయణ, పగిడిమర్రి వాసు, ఉపాధ్యక్షుడు మునగపాటి విష్ణు, ప్రధాన కార్యదర్శ కోట శ్యామ్ కుమార్, సహాయ కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్, కోశాధికారి కోట పవన్ కుమార్, పాలకవర్గ సభ్యులు విడెం రమేష్, గంజి నరేష్, శిరందాసు నరేందర్, కైరంకొండ శంకర్, కంది అశోక్, బాత్కు విజయ్ కుమార్, గంజి ధనంజయ్, బూసం భాను చందర్ , స్థానికులు కోట జగదీష్, మామిడిశెట్టి శ్రీనివాస్, తిరునగర్ గోపాల్, వర్కాల చందు, తిరునగర్ లక్ష్మణ్, శిరందాసు ప్రభాకర్, ఉడుత సురేష్, మూశం నరేష్, తోపాటు మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనంజయ్, నాయకులు టి. ప్రేమ్ గౌడ్ , టి. సంతోష్ గౌడ్, మసున వెంకటేష్, బాస శ్రీనివాస్, కళ్లెం లక్ష్మారెడ్డి, అడికె అర్జున్, బోనకుర్తి రాము, అనిల్ ,శేఖర్, నాని, ఎల్లప్ప , కలీల్, స్థానిక మహిళలు గంజి పద్మమ్మ, గద్దె పద్మ, కుకుడాల వెంకటమ్మ, ఏర్వ ఇందిర, పగిడిమర్రి ఉమాదేవి, పారెపల్లి చంద్రకళ, అవ్వారి సావిత్రీ, కూనల అనిత,చల్లారత్నం, పులిజాల మాధవి తదితరులు పాల్గొన్నారు.



## వచ్చే బడ్జెట్ సమావేశాలలో బీసీ సబ్ ప్లాన్ ప్రవేశపెట్టాలనీ మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి వినతి

### బడ్జెట్ లో బీసీల సంక్షేమానికి రూ.20వేల కోట్లు కేటాయించాలి బిసి జేఏసీ

**మిర్యాలగూడ , ఫిబ్రవరి 20:-( ప్రభాత సూర్య ):** వచ్చే ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో కామారెడ్డి డిక్లరేషన్ లో పేర్కొన్న విధంగా బీసీల సంక్షేమానికి 20వేల కోట్లు కేటాయించడంతోపాటు చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ తీసుకురావాలని కోరుతూ బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణం సాగర్ రోడ్లోని మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో తాము అధికారంలోకి రాగానే ప్రతి ఆర్థిక సంవత్సరానికి బీసీల బడ్జెట్ను 20 వేల కోట్లు పెంచుతామని, మహాత్మ జ్యోతిబా పూలే పేరుతో చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ తీసుకొస్తామని, ప్రభుత్వ కాంట్రాక్టులలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని బీసీ కులవృత్తుల ఉపాధి కోసం బడ్జెట్ కేటాయిస్తామని ప్రకటించిందని కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 2 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన కామారెడ్డి హామీని అమలు చేయడం లేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా బీసీ సబ్ ప్లాన్ తెచ్చి బీసీలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ::బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి దుర్గయ్య రజక, లవన్ కుమార్ వెంకటేష్ సుదర్శన్ రవి అశోక్ బాలు సందీప్ సంతులాల్ ధర్మయ్య కిషన్ రాజేష్ మహేష్ రాంబాబు పాల్గొన్నారు.

## ఎకనామిక్స్ బోధించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించవచ్చు

### రాష్ట్ర ఉన్నత విద్య జాయింట్ డైరెక్టర్ బాలభాస్కర్



**మిర్యాలగూడ ఫిబ్రవరి 20:-( ప్రభాత సూర్య:** కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్ధశాస్త్ర విభాగం ఆధ్వర్యం లో జరుగుతున్న మూడు రోజుల బేసిక్ క్వాంటిటీటివ్ టెక్నిక్స్ ఇన్ టీచింగ్ ఆఫ్ ఎకనామిక్స్ అనే వర్క్షాప్కు సంబంధించి చీఫ్ గెస్ట్ తెలంగాణ ఉన్నత విద్య జాయింట్ డైరెక్టర్, ప్రొఫెసర్ పి.బాలభాస్కర్ అన్నారు. రెండో రోజు శుక్రవారం ప్రభుత్వ కెఎన్ఎం డిగ్రీ కళాశాలలో సెమినార్ రెండో రోజు శుక్రవారం ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్వాంటిటీటివ్ టెక్నిక్స్ కు సంబంధించిన సబ్జెక్టు పైన మరింత మెలకువలను నేర్పించే ఉద్దేశంతో కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్ధశాస్త్ర విభాగం డాక్టర్ గుమ్మడి నరేష్ తలపెట్టిన 3 రోజుల వర్క్షాప్ తో అధ్యాపకుల్లో సృజనాత్మకత పెంచడంతోపాటు అధ్యాపకులు విద్యార్థులకు సులభంగా బోధించడానికి ఉపయోగపడుతుంది. అంతేకాక క్వాంటిటీ టు మెథడ్స్ అంటే విద్యార్థుల్లో కొంత భయాందోళనలు ఉంటాయన్నారు. వాటిని దూరం చేయడం ఉపాధ్యాయుల యొక్క కర్తవ్యం ముఖ్యంగా ఉపాధ్యాయులు కఠిన తరమైనటువంటి సబ్జెక్టులను సులభతరం చేసి బోధించడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తారన్నారు. ట్రైనింగ్ ఇచ్చినట్లయితే విద్యార్థులకు మరింత సౌకర్యంగా పాఠాలు అర్థమవుతాయి. ఇందుకుగాను రోసా నుంచి ఆర్థిక సహకారాన్ని పొందే విషయంలోనూ వర్క్ షాప్ నిర్వహణలోనూ డాక్టర్ గుమ్మడి నరేష్ కు అన్ని రకాలుగా సహకరించామన్నారు. కార్యక్రమం భవిష్యత్తులో మరోసారి తలపెట్టే స్టాటిస్టిక్స్ ప్రోగ్రాం కూడా ఆర్థిక సహకారాన్ని అందిస్తానని ప్రొఫెసర్ బాలభాస్కర్ అర్ధశాస్త్ర విభాగం డాక్టర్ నరేష్ కు హామీ ఇచ్చారు. కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్లు పెంచుకోవడంలోనూ విద్యార్థుల ఉత్తీర్ణతను పెంపొందించడంలోనూ మరింత దృష్టి పెట్టాలన్నా రు. అలాగే విద్యార్థులకు కూడా బయోమెట్రిక్ విధానాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తున్నట్లు తెలియజేశారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జునరెడ్డి పనితీరు గురించి మరింత ప్రశంసలు కురిపించారు. భీమార్జును రెడ్డి సారధ్యంలో కళాశాల మరింత అభివృద్ధి చెందాలని ప్రొఫెసర్ బాలభాస్కర్ శుభాకాంక్షలు తెలిపారు. అర్ధశాస్త్ర విభాగం తలపెట్టిన క్వాంటిటీటివ్ మెథడ్స్ వర్క్ షాప్ కు సంబంధించి పార్టిసిపెంట్స్ ను కూడ ప్రశంసించడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల జాయింట్ డైరెక్టర్ బాల భాస్కర్ అధ్యక్ష ఉపన్యాసాన్ని గురించి వర్క్ షాప్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మడి నరేష్ మాట్లాడుతూ బాల భాస్కర్ లాంటి జెడి విద్య అనుభవంతో పాటు పరిపాలన అనుభవమున్న వ్యక్తి కావడం అధ్యాపకులు మనసులో కళాశాలలో ఉన్న సమస్యల పైన స్పష్టమైన అవగాహన ఉన్న వ్యక్తి జెడిగా ఉండడం ద్వారా అధ్యాపకుల సమస్యలను సులభంగా పరిష్కరించే అవకాశం దొరికిందని ప్రభుత్వ కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న వర్క్ షాప్ కు చీఫ్ గెస్ట్ గా విచ్చేసి వర్క్ షాప్ పార్టిసిపెంట్స్ తో పాటు వర్క్ షాప్ జరుగుతున్న విధానాన్ని అభినందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఒక ఉన్నత విద్య ఆఫీసర్ బ్లెస్సింగ్స్ దొరకడం పూర్వజన్మ సుకృతమని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ భీమార్జునా రెడ్డి మాట్లాడుతూ జాయింట్ డైరెక్టర్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడమే కాకుండా కళాశాల అడ్మిషన్స్ మరింత పెంచి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచి కళాశాల ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని బాల భాస్కర్ హామీ ఇచ్చారు. వర్క్ షాప్ నిర్వాహకుడు డాక్టర్ గుమ్మడి నరేష్ కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జునరెడ్డి, క్వాంటిటీ టు మెథడ్స్ పార్టిసిపెంట్స్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






## కౌన్సిలర్ బత్తుల వాణికి ఘన సన్మానం

**చౌటుప్పల్.ఫిబ్రవరి 20. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా గెలుపొందిన బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్ శుక్రవారం కౌన్సిలర్ గా మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఊదరి నరసింహ ఆధ్వర్యంలో వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు లందగిరి భీమయ్య, మున్సిపల్ నాయకులు ఉదరి యాదయ్య, సీనియర్ నాయకులు చింతల సాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ కరపత్రం ఆవిష్కరించిన రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి.......

**ఆలేరు ఫిబ్రవరి 20 పభ్రాత సూర్య.:** ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో 2026-2027 సంవత్సరానికి అడ్మిషన్ల కొరకు (దోస్త్ వెబ్ సైట్) కళాశాల దోస్త్ కమిటీ తయారు చేసిన కరపత్రంను కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి శుక్రవారం రోజున స్థానిక డిగ్రీ కళాశాల లో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరింత సమాచారం కోసం దోస్తు వెబ్ సైట్ సందర్శించవచ్చని .తెలిపారు. విద్యార్థిని విద్యార్థుల అడ్మిషన్ల కొరకు ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం కృషి చేస్తున్నందుకు వారిని అభినందించారు. మెరుగైన వసతులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. రెగ్యులర్ తరగతులతో పాటు ప్రత్యేక తరగతులను డిజిటల్ రూపంలో అధ్యాయకులు అందిస్తున్నారని అన్నారు. విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఆలేరు కళాశాల లో ప్రవేశానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విశాలమైన తరగతి గదులు, ప్రయోగశాలలో, కంప్యూటర్ ల్యాబ్ లు, క్రీడా మైదానం, పుస్తకాలతో కూడిన లైబ్రరీ అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజారామ్, దోస్త్ కమిటీ కన్వీనర్ నందకుమార్, మరియు అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్



**తుర్కపల్లి ,ఫిబ్రవరి 20 ప్రభాతసూర్య:** తుర్కపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో నూతన తహసిల్దార్ గా రవికుమార్ శుక్రవారం బాధ్యతల స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కల్పన, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## నాటి తెలంగాణ సాయుధ పోరాట వీరుల చరిత్ర నేటి యువతకు ఆదర్శం

### సిపిఎం రాష్ట్ర నేత మల్లేష్



**మిర్యాలగూడ ఫిబ్రవరి 20:-( ప్రభాత సూర్య) :** భూమికోసం భుక్తి కోసం మానవాళి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం లో పాల్గొన్న నాయకుల జీవితం ఆదర్శనీయమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.మల్లేష్ తెలిపారు. శుక్రవారం నాడు స్థానిక సిపిఎం కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల శ్రీనివాస్ రెడ్డి ఏడవ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడి గ్రామ రాజ్యాల ఏర్పాటుకు కారణమైన నా టీ పోరాటం చిరస్మరణీయమైందన్నారు. ఆ పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శం కావాలని వారు అనుసరించి మార్గం మరువలేనిదని వారన్నారు. నేడు పాలకుల అనుసరిస్తున్న దివాలా కోరు విధానాలపై పోరాటం కొనసాగించాలని అందుకు ప్రజలు సమాయత్తం కావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మాయ మాటలు చెప్పి కాలం వెళుతుంది తప్ప ప్రజా ఉపయోగకరమైన పనులు ఏమీ చేయలేదని వారు విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు జిల్లా కమిటీ సభ్యులు మంగారెడ్డి, రవినాయక్, నంద్యాల కృపాకర్ రెడ్డి, నంద్యాల వేణుధర్రెడ్డి సిఐటియు నాయకులు తిరుపతి రామ్మూర్తి రామచంద్రు ఏఎస్ రావు పాల్గొన్నారు



## డీసీసీబీ బ్యాంక్ లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలి

### రైతు సంగం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 20:**సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న డీసీసీబీ బ్యాంక్ లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని రైతు సంగం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను కోరారు. నేడు రైతు సంగం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి డీసీసీబీ బ్యాంక్ లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని ప్రభుత్వంను కోరారు.రైతుల నుండి అదనంగా 1% డబ్బులు వసూలుచేసిన డీసీసీబీ బ్యాంక్ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా లో ఇప్పటికే రైతులు పంటలు నష్ట పోయి తీవ్ర ఇబ్బందులలో ఉన్నారని అన్నారు.రాష్ట్రంలో ఎక్కడ లేని విదంగా ఆర్ బి ఐ, నాబార్డ్ నిబంధనలు అతిక్రమిస్తూ జిల్లాలో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అదనంగా వసూలు చేసిన సుమారు 8 కోట్ల రూపాయలు రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య,సహాయ కార్యదర్శి యస్.రమేష్ గౌడ్,ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు జైపాల్ రెడ్డి,విట్టల్,మాణిక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 6వ వార్డును అభివృద్ధిలో ముందుంచుతా వైస్ చైర్‌పర్సన్ అంగిడి ఆంజనేయులు...





**ఆలేరు, ఫిబ్రవరి 20 (ప్రభాత సూర్య):** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని 6 వా వార్డు సమైక్య అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతామని నూతన వైస్ చైర్‌పర్సన్‌గా అంగిడి ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. 6వ వార్డును అభివృద్ధిలో ముందుంచుతానని స్పష్టం చేశారు. ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. 6వ వార్డులో పలు సమస్యలను సమిష్టించి అందరి సమన్వయంతో వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో అభివృద్ధి దిశలో కొనసాగిస్తామని తెలిపారు మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. వార్డు ప్రజల అవసరాలను గుర్తించి, ప్రతి సమస్యను వేగవంతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.అభివృద్ధి పనుల్లో పారదర్శకత, సమర్థతకు ప్రాముఖ్యతనిస్తూ, ప్రజల సహకారంతో వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. మున్సిపల్ పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండేలా పని చేస్తానని వెల్లడించారు.

## గ్రామాభివృద్ధికి కృషి చేస్తా.. అభివృద్ధి దిశలోకి తీసుకెళ్తానని ..బాహుపేట సర్పంచ్ కవిడే మహేందర్...





**ఆలేరు ఫిబ్రవరి 20 పభ్రాత సూర్య:** గ్రామాభివృద్ధికి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అహర్నిశలు కృషి చేస్తానని బాహుపేట గ్రామ సర్పంచ్ కవిడే మహేందర్ తెలిపారు. యాదగిరిగుట్ట మండలంలోని బాహుపేట గ్రామంలో కుండే లక్ష్మికి ఇటీవల మంజూరైన ఇందిరమ్మ ఇల్లును 6వ వార్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజల ఐక్యతే అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని అన్నారు. ఎన్నికల ముందు తాను బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్నప్పటికీ, అనంతరం గ్రామ సర్పంచ్‌గా అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి నిస్వార్థంగా సేవలందిస్తానని హామీ ఇచ్చానని తెలిపారు . గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి సమగ్ర అభివృద్ధి దిశగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లలిత, వార్డు సభ్యులు పంజాల సురేష్, కుండే శంకర్, మోటె నాగరాజు, కంకల లావణ్య, బుడిగే కిష్టమ్మ, మోటే అరవింద్, పి. ఆదాము, బీమాగాణి భార్గవి, ఎండీ రహీమ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆరేశ్రీను, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి: హార్టికల్చర్ ఆఫీసర్ నసీమా






**మిర్యాలగూడ ఫిబ్రవరి 20:-( ప్రభాత సూర్య):** రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు కల్పిస్తున్న సబ్సిడీ, ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ డివిజన్ హార్టికల్చర్ ఆఫీసర్ నసీమా కోరారు. శుక్రవారం మిర్యాలగూడ డివిజన్ దామరచర్ల మండలం రైతు వేదికలో హార్టికల్చర్ శాఖ, పతంజలి ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై సాంకేతిక గురించి వివరిస్తూ ఎస్సీ, ఎస్టిలకు బిందు సేద్యం సబ్సిడీ 100శాతం, ఒసి బిసిలకు 90శాతం దానితో పాటు మొక్కల పై ఇస్తున్న సబ్సిడీ గురించి మిర్యాలగూడ ఉద్యాన అధికారిణి నసీమా రైతులకు వివరించారు. ప్రతి ఎకరాకు రూ.4,200 నిర్వహణ ఖర్చును కూడా అందిస్తోందని ఆమె చెప్పారు. రైతులు ప్రభుత్వ సబ్సిడిలను వినియోగించుకొని తక్షణమే పామ్ ఆయిల్ సాగుకు రైతులు ముందుకు రావాలని ఆమె తెలిపారు. అదేవిధంగా కోరమాండల్, ఇఫ్కో కంపెనే వారు మాట్లాడుతూ నీటిలో కరిగే అడుగుమందు గురించి రైతులకు వివరించారు. నల్గొండ ఆయిల్ పామ్ సొసైటీ ప్రెసిడెంట్ గురువారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి మాట్లాడుతూ 10 ఎకరాలలో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్న, ఇప్పటికీ 39 నెలల పంటకు ఇటీవల గెలలు ప్రారంభమయ్యాయన్నారు. కూలీల సమస్య ఉండదన్నారు. ప్రకృతి వైపరీత్యాల నుండి ఎటువంటి నష్టం ఉండదని, నీటి వసతి ఉన్న ప్రతి రైతు పామ్ ఆయిల్ పంట వేయాలని తెలిపారు. వరి రైతులు చూపు ఆయిల్ ఫామ్ సాగుకై మల్లిందని పతంజలి డీజీఎమ్ బొల్లంపల్లి యాదగిరి, పతంజలి మేనేజర్ డా మధుసూదన్ రెడ్డి అన్నారు.ఆయిల్ పామ్ తో పంట మార్పిడి చేస్తే రైతుల ఆర్థిక స్థితిగతులు మెర్గుపడుతా యన్నారు.పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిజిఎమ్ బొల్లంపల్లి యాదగిరి మాట్లాడుతూ ప్రతి రైతు కేవలం ఒక పామ్ ఆయిల్ మీదనే ఒక ఎకరానికి రూ.1,50,000 (లక్ష యాభైవేల) నికర ఆదాయం పొందవచ్చని, నాటిన మూడు సంవత్సరాల నుండి కాపు ప్రారంభమై 30 సంవత్సరాల వరకు దిగుబడి ఇస్తుందని, అంతేకాకుండా, అంతర పంటల కోకో, వక్క సాగు ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇతర పంటలైన వరి, ప్రత్తి, బత్తాయి కంటే ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని అధిక ఆదాయం పొందే పంట కేవలం ఆయిల్ పామ్ మాత్రమే అని సూచించారు. అనుముల మండలం కొత్తలూరు గ్రామంలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తామని, రైతులు మొక్కలు నాటుకునే సమయంలో బై బ్యాక్ పాలసీ అగ్రిమెంట్ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పతంజలి కంపెనీ గెలలు కొనుగోలు చేస్తుందని తెలిపారు. పతంజలి జిల్లా మేనేజర్ డా. మధుసూదన్ రెడ్డి రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. సమావేశంలో తహసీల్దార్ బి. జవహర్లాల్, మండల వ్యవసాయ అధికారి ఋషయేందిరమణి పాల్గొన్నారు.

## మలకపేట యశోదా హాస్పిటల్ లో అధునాతన వైద్య సదుపాయాలు అనుభవజ్ఞులైన నిపుణులతో అత్యవసర సేవలు




**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మలక్ పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కన్సల్టెంట్ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ సూరిశెట్టి భరత్ కుమార్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం ప్రాంతానికి చెందిన 33 సంవత్సరాల శ్రీమతి మరముల్ల ప్రియాంక (భర్త రాంబాబు) 12/06/2025 న వాంతులు విరేచనాలు వంటి లక్షణాలతో కండర బలహీనత వల్ల మలకపేటలో యశోదా హాస్పిటల్ లో చేరారని వెంటనే సమగ్ర రక్తపరీక్షలు బయోకెమికల్ మూల్యాంకనం మరియు బహుళ విభాగాల వైద్యుల పరిశీలన అనంతరం మొదట బయట హైవికలేమియా గా గుర్తించి అధునాతన చికిత్స కోసం అడ్మిట్ అయ్యారని పేర్కొన్నారు. ఆసుపత్రిలో చేరిన సమయంలో తీవ్రమైన పోటాషియం లోపం మరియు శారీరక అస్థిరత గమనించబడిందని అన్నారు.తీవ్రమైన ఎలక్ట్రోలైట్ అసమతుల్యతలు ఆటోఇమ్యూన్ సంబంధిత మెటబాలిక్ వ్యాధులు సకాలంలో చికిత్స చేయకవిత ప్రాణాపాయ స్థితులకు దారితీసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా హైపోకలోమిక్ పీరియాడిక్ ప్యారాలిసిస్ వంటి వ్యాధులు మూత్రపిండ సమస్యలు మరియు ఆటోఇమ్యూన్ రుగ్మతలతో కలిసివస్తే నరాల వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపవచ్చు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ముందస్తు గుర్తింపు సమగ్ర వైద్య మూల్యాంకనం మరియు బహుళ విభాగాల సమన్వయ ంతో కూడిన చికిత్స అత్యంత అవసరమన్నారు. హైపోకలేమిక్ పీరియాడిక్ పెరాలిసిస్ మెరుగుదలలో ప్రైమరీ షోన్స్ సింద్రోమ్ డిస్టల్ రీనల్ ట్యూబ్యులర్ అసిడోసిస్ సెంట్రల్ ఫౌంటైన్ మైలినోలిసిస్ కొత్తగా ప్రారంభమైన సిక్స్ హైపర్కలేమియా సరిచేయబడింది. రోగిని అత్యంత జాగ్రత్తతో పర్యవేక్షించే విభాగంలో ఉంచి నియంత్రిత విధానంలో వితాషియం స్థాయిలను సరిచేయడం ఎలక్ట్రోలైట్ సమతుల్యతను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఆకస్మిక మార్పులు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నాము. చికిత్సలో భాగంగా తీవ్రమైన హైపోకలేమియా నియంత్రితంగా సరిచేయడం సీల్డ్స్ నియంత్రణకు యాంటీ ఎపిలెప్టిక్ మందులు రీనల్ ట్యూబ్యులర్ ఆసిడోసిస్ కు తగిన చికిత్స ప్రైమరీ షోన్స్ సింద్రోమ్కు ఇమ్యూనోథెరపీ చికిత్స సమయంలో వచ్చిన హైపర్కలేమియాను వెంటనే గుర్తించి సరిచేయడం న్యూరాలజీ నెఫ్రాలజీ రుమటాలజీ క్రిటికల్ కేర్ జనరల్ మెడిసిన్ తదితర విభాగాల వైద్యులు సమన్వయంతో చికిత్స అందించము.క్రమంగా రోగిలో కండర బలం మెరుగుపడి ఏటాషియం స్థాయిలు స్థిరపడ్డాయి. హైపోకలేమిక్ పీరియాడిక్ ప్యారాలిసిస్ ప్రాణాపాయ స్థితికి దారితీసి వ్యాధి. తీవ్ర పొటాషియం లోపం వల్ల అకస్మాత్తుగా కండర బలహీనత మరియు శ్వాస సమస్యలు రావచ్చు.ముఖ్యంగా ఆటో ఇమ్యూన్ మూత్రపిండ సంబంధిత కారణాలను గుర్తించడం అత్యంత కీలకం.సకాలంలో ఎలక్ట్రోలైట్ సరిచేయడం మరియు బహుళ విభాగాల సమన్వయం ఈ కేసులో కీలక పాత్ర పోషించాయి అని అన్నారు.ఫలితంగా ఆసుపత్రి చికిత్స సమయంలో రోగి స్థిరంగా కోలుకుని కండర బలం మెరుగుపడి ఎలక్ట్రోలైట్ స్థాయిలు సాధారణ స్థాయికి చేరి 18/06/2025న రోగిని స్థిర స్థితిలో డిశ్చార్జ్ చేసి ఔషధాలు ఆహార నియమాలు మరియు క్రమమైన ఫాలోఅప్ సూచనలు ఇచ్చాము.ఈ కేసు యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మలకపేట లో అందుబాటులో ఉన్న అత్యాధునిక నిర్ధారణ సదుపాయాలు అనుభవజ్ఞులైన నిపుణులు 24 గంటల క్రిటికల్ కేర్ సేవల సామర్థ్యాన్ని మరోసారి చాటిచెప్పిందని అన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి





**సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 20(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని 8వ వార్డులో పోచంపల్లి పద్మ-దేవరాజు ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు గత కొద్ది నెలాలుగా నిర్మాణంలో ఉన్నటువంటి ఇందిరమ్మ ఇల్లు శుక్రవారం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి చేతుల మీదుగా గృహప్రవేశం చేశారు.... అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ మా సొంత ఇంటి కల కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా అయిందని తెలంగాణ ప్రభుత్వనికి మరియు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అనంతరం గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి మాట్లాడుతూ అర్హులైనటువంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే తెలంగాణ ప్రభుత్వం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, స్ఫూర్తి కళాశాలల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్,మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు చిలువేరు కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఎండి రహీమ్ షరీఫ్, మాజీ వార్డ్ సభ్యులు ఎండి ముస్తఫా ఖాన్,వార్త మిర్రర్ పత్రిక జిల్లా స్టాపర్ గోల్లూరి గణేష్ సాగర్, కేశెట్టి దశరథ, గ్రామ వార్డ్ నెంబర్లు సూరపల్లి వెంకటేష్ నేత,సభావాత్ రఘునాయక్, కట్ల వనజ భాస్కరాచారి, చిలివేరు రమాదేవి శంకర్,బాల్గురి శివ సాగర్, గునిగంటి రాజు గౌడ్, శిఖిలమెట్ల సాయి,ఎండి సాదక్ ఖురేషి, బంధుమిత్రులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.





# యాదగిరిగుట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## మత్స్యావతారంలో మెరిసిన శ్రీస్వామివారు!



**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 20(ప్రభాత సూర్య):** లోక రక్షకుడైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో నిత్యారాధనల అనంతరం శ్రీస్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శోభాయమానంగా అలంకరించిన మత్స్యావతార మూర్తిని తిరువీధుల్లో ఊరేగిస్తుండగా భక్తులు నీరాజనాలు పలికారు.

**మత్స్యావతార విశిష్టత**

శ్రీమన్నారాయణుని దశావతారాల్లో మొదటిదైన మత్స్యావతారం భక్త రక్షణకు ప్రతీక. వేదాలను అపహరించిన సోమకాసురుడిని సంహరించి, సృష్టి చక్రం ఆగిపోకుండా బ్రహ్మదేవునికి వేదాలను అప్పగించిన ఘట్టాన్ని ఈ అలంకారం స్మరింపజేస్తుంది. లోకమంతా తన సంతానమని, వారిని తన చల్లని చూపులతో సంరక్షించే పరమాత్మ తత్త్వం ఈ అవతారంలో దాగి ఉందని అర్చకస్వాములు తెలిపారు.

**ఘనంగా నిర్వహించిన అధికారులు, పండితులు**

శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితుల బృందం ఈ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి భవాని శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, మరియు ఉప కార్యనిర్వహణాధికారి, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది మరియు భారీ సంఖ్యలో ‹క్తులు పాల్గొన్నారు.

**రాత్రి 'శేష వాహన' సేవ**

రాత్రి స్వామివారు పడగ విప్పిన ఆదిశేషునిపై శేష వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. భూ మండలాన్ని తన శిరస్సుపై మోసే ఆదిశేషుడు, భగవంతునికి శయ్యగా, ఆసనంగా, పాదుకలుగా కైంకర్యం చేస్తూ భక్తులకు సేవాభావాన్ని చాటి చెబుతారు. బ్రహ్మోత్సవాల ప్రారంభంలోనే ఈ వాహన సేవ నిర్వహించడం విశేషం. ఆధ్యాత్మిక, సాంస్కృతిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు కనువిందు చేస్తున్నాయి.



# షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన ఇంటి బాధితులకు ఆర్థిక సహాయం

**ఖమ్మం (ప్రభాత సూర్య ప్రతినిధి):** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గణేషునిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని యల్ ఎస్ బంజర్ నందు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధం అయిన షేక్. నాగులమీరా ఇంటిని గ్రామ పెద్దలు చింతనిప్పు నరసింహారావు తో కలిసి సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చి 5000/- రూపాయలు ఆర్థిక సహాయం . గ్రామ సర్పంచ్ పులపాకు మంగ తిరుపతి రావు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి భాస్కర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి దేవాలయ నూతన కమిటీ ఎన్నిక



**సంస్థాన్ నారాయణపూర్, ఫిబ్రవరి 20(ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల అల్లందేవిచెర్వు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీని శుక్రవారం గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజుగౌడ్ అధ్యక్షతన గ్రామ ప్రజలందరి సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. దేవాలయ కమిటీ అధ్యక్షులుగా సుర్వి చంద్రంగౌడ్ ప్రధాన కార్యదర్శిగా అంతటి సురేష్ గౌడ్ ఉపాధ్యక్షులుగా చిరగోని మహేష్ యాదవ్,ఉపాధ్యక్షులుగా సుర్వి రవి గౌడ్ కార్యదర్శిలుగా గుండు లింగస్వామి గౌడ్, ఏర్పుల సురేష్, కోశాధికారిగా సుర్వి లింగస్వామి గౌడ్ సుర్వినరేష్ గౌడ్ గారు,సుర్వి హనుమంత్ గౌడ్ వీరితోపాటుగా 20 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు,గ్రామ ప్రజలు,వివిధ పార్టీల నాయకులు,వివిధ కుల సంఘాల నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ

### ఈ భవనం మహిళా సంఘాల బలోపేతానికి పునాది

### తిరుగండ్లపల్లి సర్పంచ్ పందుల లక్ష్మమ్మ జంగయ్య గౌడ్



**మర్రిగూడ ఫిబ్రవరి 20 ప్రభాత సూర్య:** మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లి గ్రామ పంచాయతీ లో ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న గ్రామ సంఘం భవన నిర్మాణానికి శుక్రవారం ఘనంగా భూమి పూజ నిర్వహించి తిరుగండ్లపల్లి సర్పంచ్ పందుల లక్ష్మమ్మ జంగయ్య గౌడ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని సర్పంచ్ తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో నాణ్యతా ప్రమాణాలతో భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామిడి భూపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగమణి,వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు రమాబాయి చిత్రపటం అందజేసిన అన్నారం సాయిలు

**వికారాబాద్, ఫిబ్రవరి 20(ప్రభాత సూర్య ):** వికారాబాద్ జిల్లా కోడంగల్ మండలం అన్నారం గ్రామంలో శుక్రవారం నవీన్ వివాహం శిరీష తో జరిగిన వివాహ మహోత్సవానికి అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు అన్నారం సాయిలు, నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి రమాబాయి అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. అన్నారం సాయిలు ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఆడవారి పాత్ర ఉన్నతమైందని అందుకు నిదర్శనం రమాబాయి అంబేద్కర్, సతీ సావిత్రి , ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి వారు ఎందరో ఆదర్శ స్త్రీలు ఉన్నారని వారన్నారు. నూతన వధూవరులకు వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.






# జిల్లా విద్యా నిర్మాణ పనులపై కలెక్టర్ సమీక్ష

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 20:** జిల్లా లోని పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్ లలో చేపడుతున్న మౌలిక సదుపాయాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



ఆధ్వర్యంలో మండల విద్యా అధికారులు, సమగ్ర శిక్ష విభాగంతో సమీక్షా సమావేశం జరిగింది. పీఎం శ్రీ పథకం, భవిత సెంటర్లు, కేజీబీవీ సివిల్ వర్క్‌తో పాటు పలు విద్యా నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. భవిత సెంటర్ల నిర్మాణంలో జహీరాబాద్, మోగుడంపల్లి, కల్హేర్, కొండాపూర్, మనోహర్, మునిపల్లి, పుల్కల్, సిర్గాపూర్, కంగ్టి మండలాల్లో పనుల పురోగతిపై వివరాలు అడిగి, నిర్మాణ వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే కేజీబీవీ భవనాల నిర్మాణాల్లో న్యాల్కల్, నాగలిగిద్ద, పుల్కల్, మనూర్, సిర్గాపూర్, వట్పల్లి ప్రాంతాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పీఎం శ్రీ పథకం కింద సైన్స్ ల్యాబ్‌లు, ఇతర భవన నిర్మాణాల పురోగతిని విద్యా శాఖ అధికారులు కలెక్టర్ కు విచారించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎన్‌ఆర్జీఎస్ కింద మంజూరైన టాయిలెట్లను మార్చి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం శ్రీ బడ్జెట్, యు డి ఐ ఎస్ ఈ డేటా, ప్రీ-ప్రైమరీ పాఠశాలల అంశాలు కూడా సమావేశంలోపరిశీలించబడ్డాయి. సంబంధిత విభాగాలకు డేటా ఖచ్చితత్వం, పనితీరుపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారులు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

### శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం

# మహాశివరాత్రి హుండీ లెక్కింపు




**పటాన్చెరు ఫిబ్రవరి 20 ప్రభాత సూర్య :** మండలం లోని బీరంగూడ గుట్టపై వెలిసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తుల అపార విశ్వాసంతో అంగరంగ వైభవంగా విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవస్థానం చైర్మన్ బైసా సుధాకర్ యాదవ్ , ఈవో శ్రీ శశిధర్ గుప్తా ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు సమక్షంలో నిర్వహించడం జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం రూ. 8,62,677లు రావడం ఆనందదాయకం. దర్శనం టికెట్లు, టెండర్లు, అన్నదానానికి భక్తులు అందించిన విరాళాలు కలిపి మొత్తం రూ. 80,92,132లు సమకూరడం స్వామి అమ్మవార్లపై భక్తుల అచంచల విశ్వాసానికి నిదర్శనం. ఈ మహోత్సవాలను ఇంత ఘనంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి కార్యక్రమం విజయవంతం చేసిన సీపీ, డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు. బ్రహ్మోత్సవాల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించిన విద్యుత్ శాఖ ఏడీలు, ఏఈలు మరియు సిబ్బందికి, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలందించిన అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు. దేవాలయ ప్రాంగణం మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేసిన డిప్యూటీ కమిషనర్ మరియు మున్సిపల్ సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు. అలాగే జాతర నిర్వహణలో సమన్వయంతో సహకరించిన అమీన్‌పూర్ ఎమ్మార్వో కి మరియు అన్ని శాఖల అధికారులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. దాతలు, వాలంటీర్లు, మీడియా మిత్రులు, భక్తులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఆలయ అభివృద్ధి కోసం మరిన్ని ధార్మిక, సేవా కార్యక్రమాలు చేపడతామని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమం లో భక్తులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీనియర్ పాత్రికేయులు బనగిరి గోవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు

## శుభాకాంక్షలు తెలియజేసిన సహచర పాత్రికేయులు, పలువురు నాయకులు





**కూకట్ పల్లి , ఫిబ్రవరి 20 (ప్రభాత సూర్య) :** సీనియర్ పాత్రికేయులు బనగిరి గోవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం బాలానగర్ వారి నివాసం లో ఘనంగా జరిగాయి. కూకట్ పల్లి నియోజకవర్గంకు చెందిన పలువురు పాత్రికేయులు, వివిధ పార్టీల నేతలు రాజుకాలనీలోని గోవర్ధన్ రెడ్డి నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పూల మాల వేసి శాలువాతో సత్కరించి, కేక్ ను కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు చింతా నర్సింగ్ రావు, పంతం వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, చైతన్యా రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు మదన్ మోహన్, కిరణ్ కుమార్, మట్టే ప్రసన్న, సిపిఎం నేత ఐలాపురం రాజశేఖర్, గుండెటి నర్సింగ్ రావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.



## అల్లందేవిచెర్వు ఆంజనేయస్వామి దేవాలయ నూతన కమిటీ ఎన్నిక

**సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 20(ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల అల్లందేవిచెర్వు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీని శుక్రవారం గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజుగౌడ్ అధ్యక్షతన గ్రామ ప్రజలందరి సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షులుగా సుర్వి సౌజన్య రాజు గౌడ్ ,అధ్యక్షులుగా సుర్వి చంద్రంగౌడ్ ప్రధాన కార్యదర్శిగా అంతటి సురేష్ గౌడ్ ఉపాధ్యక్షులుగా చిరగోని మహేష్ యాదవ్,ఉపాధ్యక్షులుగా సుర్వి రవి గౌడ్ కార్యదర్శిలుగా గుండు లింగస్వామి గౌడ్, ఏర్పుల సురేష్ కోశాధికారిగా సుర్వి లింగస్వామి గౌడ్ సుర్వి నరేష్ గౌడ్ ,సుర్వి హనుమంత్ గౌడ్ వీరితోపాటుగా 20 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు,గ్రామ ప్రజలు,వివిధ పార్టీల నాయకులు,వివిధ కుల సంఘాల నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

## సీఎం కప్ - 2025 సెకండ్ ఎడిషన్ ప్రారంభం

### గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభించిన మంత్రి శ్రీహరి

### క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో సాగుతున్నామని వెల్లడి



హైదరాబాద్,ఫిబ్రవరి: సీఎం కప్ - 2025 సెకండ్ ఎడిషన్ అట్టహాసంగా ప్రారంభంఅయ్యింది. మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి, క్రీడా శాఖ అధికారులు ప్రారంభ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి వివిధ స్కూల్స్, కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థుల మార్చ్ తో మంత్రి వాకిటి శ్రీహరి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా లేజర్ షో, శివమణి ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సీఎం కప్ 2025 సెకండ్ ఎడిషన్ ను ప్రారంభిస్తున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించారు. రాష్టాన్ని క్రీడల్లో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చారన్నారు. ఆటల్లో క్రమశిక్షణ ఉంటేనే విజయం సాధ్యం అన్నారు. అంతర్జాతీయ పోటీల్లో క్రమశిక్షణ లేకపోవడం వల్లనే విజయాలు సాధించలేకపోతున్నాం అన్నారు. క్రీడల్లో స్వార్థం, నైపుణ్యం ఉంటేనే రాణిస్తాం. బాల్యంలో ఒక లక్ష్యం పెట్టుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుంది. ప్రతి క్రీడాకారుడు ఆటల మీద దృష్టి సారించాలి. ఆడాలనే కసి ఉంటేనే దేశం తరపున ఆడే అవకాశం వస్తుంది. ఆటలో లీనమై, అదే ప్రపంచం అనుకోని ముందుకు నడవండి అప్పుడే జీవితం బాగుటుంది. గత ప్రభుత్వాలు ఆటలను పట్టించుకోలేదు. తెలంగాణ అంతటా క్రీడా స్ఫూర్తి నింపాలని ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని వివరించారు. ఆటలను టైం పాస్ గా కాకుండా విజయం సాధించే దిశగా అడుగులు వేయండి.దేశం, రాష్ట్రం తరుపున ఆడాలనే స్ఫూర్తి ఉండాలని సూచించారు. ఇకపోతే సీఎం కప్ -2026 సెకండ్ ఎడిషన్ కార్యక్రమం సందర్భంగా నేషనల్ మాస్టర్స్ అ÷-లథెట్స్ అసోసియేషన్ కు సంబంధించిన వివిధ విభాగాల్లో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి మెడల్స్ సాధించిన అథ్లెట్స్ ను క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభినందించారు. వివిధ అ÷-లథెట్స్ లో మెడల్స్ సాధించి భారత, తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అథ్లెట్స్ ను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.

## ఏప్రిల్‌లో తెలంగాణలో సర్ ప్రక్రియ

### జిల్లాల అధికారులకు ఎన్నికల అధికారి సూచనలు

హైదరాబాద్: ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ఎస్ఐఆ÷-కు సంబంధించి సన్నాహకాలను వేగవంతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సీఈవో కార్యాలయం నుంచి మెదక్, మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సహాయ ఎన్నికల నమోదు అధికారులకు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు.మొత్తం 195 మంది ఏఈఆర్‌ఓలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ, నవీకరణ, నిర్వహణ అంశాలపై విపులంగా అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాల్లో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం, వివరాల సవరణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు.÷ూబోయే ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహకాలను సమయానికి పూర్తి చేయాలని సుదర్శన్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఓటరు జాబితాల స్వచ్ఛతను కాపాడటంలో ఏఈఆర్‌ఓల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. న్నికల పక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని అధికారులు తెలిపారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు





**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 20:** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గస్థాయిలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నర్సాపూర్ ఆర్డిఓ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్, నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పాల్గొని బంజారాల సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా వారితోపాటు కలిసి స్టెప్పులు వేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి సంత్ సేవాలాల్ మహారాజ్ నూతన మందిరం నిర్మాణం జరిగే ప్రాంతానికి వెళ్లి అక్కడ బహిరంగ సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారా సంఘం నాయకుడు సామ్యా నాయక్ పత్రిక విలేకరులతో మాట్లాడుతూ సంత్ సేవలల్ మహారాజ్ బంజారాల ఆరాధ్య దైవమని, ఆయన దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తిరుగుతూ బంజారాలను ఐక్యమత్యం చేసి వారిలో సేవాభావాన్ని పెంపొందించారని తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని గ్రామ గ్రామం నుండి ప్రజలు, నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారని తెలిపారు. సేవాలాల్ మహారాజ్ ఆదర్శ పురుషుడు, బంజారాలకు దేవుడు, బంజారాలను సన్మార్గంలో నడపడం కోసం ఆయన అనేక సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. ఆయన బోధించిన మార్గాన్ని బంజారా లు పాటిస్తూ, ఆయన చూపిన మార్గంలో నడవాలని కోరారు. అనేక రాష్ట్రాల్లో బంజారా బిడ్డలు విడిపోయి ఉంటే వారందరినీ ఒక తాటి మీదికి తెచ్చి ఐకమత్యంగా చేసిన గురువు, దైవం అన్ని ఆయనే అని తెలిపారు. అందుకే ఆయన జయంతిని నర్సాపూర్ పట్టణంలో ఘనంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్యం గౌడ్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు పాప గారి చిన్న రమేష్ గౌడ్, తాసిల్దార్ శ్రీనివాస్, నర్సాపూర్ ఎస్సై రంజిత్ కుమార్ అనేక గ్రామాల నుండి ప్రజలు, బంజారా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని తెలిపారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు అందరు కృషి చేయాలి

### మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్



**ప్రభాత సూర్య నర్సాపూర్ ఫిబ్రవరి 20:** సంత్ సేవాలాల్ మహా రాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అన్నారు. నర్సాపూర్ లో శుక్రవారం ప్రభుత్వం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన శోభా యాత్ర లో పాల్గొన్నారు.శోభా యాత్ర నర్సాపూర్ పట్టణ పుర వీధుల గుండా హైదరాబాద్ ప్రధాన రహదారి ప్రక్కన గల సంత్ సేవాలాల్ ఆలయం వరకు శోభా యాత్ర కొనసాగింది.గిరిజన సోదరులతో కలిసి వారి సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహా రాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.గిరిజనులకు సంత్ సేవాలాల్ మహా రాజ్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.గిరిజనులకు



కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలిపారు.తండాల్లో నివసించే ప్రతి కుటుంబం తమ పిల్లలను చదివించుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.పిల్లలు చదువుకోవడం వల్ల వారి భవిషత్తు కు బంగారు బాటలు వేసిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపాలిటీ చైర్మెన్ లక్ష్మీ రాజు యాదవ్,గిరిజన సంఘం నాయకులు,సర్పంచులు,సురేష్ నాయక్,ఉదయ్ కుమార్,మాజీ ఎంపీటీసీ అశోక్,మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగాభారతి నగర్ డివిజన్‌లో సంత్ గురు రవిదాస్ 649వ జయంతి వేడుకలు.

**పటాన్చెరు ఫిబ్రవరి 20 ప్రభాత సూర్య :** మండలం లోని భారతి నగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీ రామచంద్రాపురంలో శ్రీ సంత్ గురు రవిదాస్ మోచి సంఘం ఆధ్వర్యంలో 649వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ ఆదర్శ్ రెడ్డి హాజరై గురువర్యులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ సంత్ గురు రవిదాస్ బోధనలు సమానత్వం, సౌభ్రాతృత్వం మరియు మానవతా విలువలకు ప్రతీకగా నిలిచాయని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి ఆయన ఆశయాలు మార్గదర్శకాలని తెలిపారు. కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, బీఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్ యాదవ్, యువజన అధ్యక్షుడు నర్సింహ, మైనారిటీ సెక్రటరీ ఘౌస్, బీఆర్ఎస్ యువ నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ జయంతి వేడుకలను నిర్వహించిన శ్రీ సంత్ గురు రవిదాస్ మోచి సంఘం కార్యవర్గ సభ్యులు: ఎస్. దశరథ్ -- చైర్మన్, నరసింగ రావు -- చీఫ్ అడ్వైజర్, ధనాజీ -- ప్రెసిడెంట్, హెచ్. శివరాజ్ -- జనరల్ సెక్రటరీ కె. అంబాదాస్ -- జాయింట్ సెక్రటరీ హెచ్. శ్రవణ్‌కుమార్ -- ట్రెజరర్ జి. సురేష్ -- ఆర్గనైజింగ్ సెక్రటరీ సంఘం ప్రతినిధులు ముఖ్య అతిథులను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## వారం రోజుల్లో జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీలు

### డిపిఆర్‌వోలను ఆదేశించిన స్పెషల్ కమిషనర్

హైదరాబాద్,ఫిబ్రవరి 20:జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను వారం రోజులలో పూర్తి చేయాలని డి.పి.ఆర్.ఓ.లను సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక ఆదేశించారు. శుక్రవారంనాడు నాంపల్లిలోని తెలగాంణ మీడియా అకాడమి ఆడిటోరియంలో అక్రిడిటేషన్ కార్డుల జారీ పక్రియ విధి విధానాలపై డి.పి.ఆర్.ఓ.లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జి.ఓ. నెం.252, 103లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పి.ఆర్.ఓ.లకు సూచించారు. జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులతో ఒక కమిటీని వారం రోజులలో పూర్తి చేయాలని ఆమె వెల్లడించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నమోదు, దరఖాస్తుల పరిశీలన, రిపోర్టులు, అప్రూవ్డ్ లిస్టులు, రిజిస్ట్రేషన్ నెంబర్ అలాట్ మెంట్, అక్రిడిటేషన్ కార్డుల డౌన్ లోడింగ్, మొదలగు అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. అదే విధంగా అక్రిడిటేషన్ కార్డుల పక్రియలో భాగంగా ఆన్ లైన్, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియా రిలేషన్ వింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే టెక్నికల్ టీమ్ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వారిని కూడా సంప్రదించి ఎలాంటి తప్పులను ఆస్కారం లేకుండా అక్రిడిటేషన్ పక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆమె కోరారు. తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన మార్గ దర్శకాల ప్రకారం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని డి.పి.ఆర్.ఓ.లను ఆయన కోరారు. క్షేత్రస్థాయిలో అక్రిడిటేషన్ జారీలో ఏమైన సమస్యలు ఉంటే స్పెషల్ కమిషనర్ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ శిక్షణా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల డి.పి.ఆర్.ఓ.లు, సంబంధిత సిబ్బంది హజరయ్యారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులకు అక్రిడిటేషన్ కార్డుల జారీపై ఆన్ లైన్ విధి విధానాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు.

## భూతగాదాల్లో కాంగ్రెస్ నేత దారుణ హత్య

**సిద్దిపేట,ఫిబ్రవరి 20:** సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ నాయకుడు దారుణ హత్యకు గురయ్యారు. భూ తగాదాల నేపథ్యంలో బాల్‌రెడ్డి (50) అనే వ్యక్తిని దాయాదులు హత్య చేశారు. దుబ్బాక పురపాలికలోని చేల్లాపూర్ వార్డు శివారులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేల్లాపూర్ వార్డుకు చెందిన వంగ బాల్‌రెడ్డిని అదే గ్రామానికి చెందిన దాయాదులు భూ తగాదాల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం దారుణంగా గొంతు కోసి చంపారు. అనంతరం నిందితులు తల్లి, కొడుకు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు అనంతరం హత్యకు సంబంధించిన వివరాలు తెలియజేస్తామని ఏసీపీ తెలిపారు.

## ఎడిటోరియల్

**ఇటీవల పెద్దపులుల జనావాసాల్లోకి వచ్చి హడలెత్తించాయి. అడపాదడపా చిరుతలు వస్తూనే ఉన్నాయి. అక్కడక్కడా ఎలుగుబంట్లు దాడి చేస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో అడవిపందులు, జింకలు పంటలపై దాడులు చేస్తున్నాయి. ఏనుగులు కూడా పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇకపోతే కోతుల దాడికి హద్దే లేకుండా పోయింది. ఇలా ఇవన్నీ జనావాసాల్లో ఎందుకు వస్తున్నాయో జనాలు ఆలోచించడంలేదు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇవన్నీ ఇలా జనావాసాల మీద పడడానికి కారణం మనమే. అడవులను, కొండలను ధ్వంసం చేసిన పాపానికి భయాన్ని అనుభవిస్తున్నాం. ఇప్పటికీ ఈ విధ్వంసం ఆగడం లేదు. ఆపాలన్న ఆలోచన రావడం లేదు.**



# వన్యప్రాణులను కాపాడుకుందాం !

మనమే ప్రకృతిని ఇలా విధ్వంసం చేస్తూ పోతే ఇకముందు తరాలు ఇంతకు మించి దారుణాలు ఎదుర్కోక తప్పదు. వానరాలు ఊళ్లమీద పడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా సంచరించే పులులు, చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి వన్యమృగాలు ఇవాళ మన గడప వరకూ వచ్చేస్తున్నాయి. వన్య ప్రాణులు అడవి దాటి, జనారణ్యంలోకి రావడానికి ప్రధాన కారణం? మనం అడవిగా భావిస్తున్న ప్రాంతంలో అవి జీవించలేకపోవడం. వాటికి కావాల్సిన ఆహారం, నీరు సమృద్ధిగా వుంటే, అవి బిక్కుబిక్కుమంటూ రోడ్ల మీదకు రావు. మనిషిలోని నాగరిక లాభాపేక్ష వృక్ష, జంతు, పక్షి జాతుల క్షీణతకు దారితీస్తోంది. పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర కీలకం. కానీ, భారతదేశంలో జనాభా విస్ఫోటనం వల్ల వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్లు, రైలు మార్గాల అభివృద్ధి వంటి కార్యకలాపాలతో అడవుల విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా పర్యావరణ సమతుల్యత లోపిస్తోంది.

వన్య మృగాలను చూసినప్పుడు, వాటిని హింసించకుండా అధికారులకు తెలియజేసే ప్రయత్నాలు రావాలి. గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నడపాలి. సంబంధిత ప్రభుత్వ శాఖలు సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోవడం, ప్రజలు ఆత్మరక్షణ చేసుకుంటూనే, హింసకు దూరంగా ఉండి అధికారులకు సమాచారం అందించడం అత్యవసరం. కేరళలో 'వన్యమృగ బీటర్లు' వంటి స్వచ్ఛంద సంఘాలు వన్య మృగాలను పట్టి, అడవుల్లో విడిచిపెడతారు. అలాగే, సోలార్ ఫెన్సింగ్, బయోఫెన్సింగ్ వాడుతారు. వన్యప్రాణులను మన 'అతిథులు'గా చూడాలి. వాటిని తిరిగి అడవిలోకి పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అడవుల పునరుద్ధరణకు పూనుకోవాలి. చిన్నా, పెద్ద తేడా లేకుండా పర్యావరణం పట్ల అవగాహన కలిగించాలి. మనిషిని, వన్యమృగాన్ని రక్షించే ఏకైక మార్గం?అడవులను, పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న సంగతి గుర్తించాలి. అడవులను నరికివేయడం,ఖనిజాల వెలికితీత పేరుతో కొండలను ధ్వంసం చేయడం వల్ల జరుగుతున్న దుష్పరిణామం ఇది. సహజవనరులను దోచుకోవడానికి అటవీ భూములను కట్టబెట్టడం, అభివృద్ధి పేరుతో ప్రకృతి సిద్ధమైన సహజ ఆవాసాలను, టూరిజం పేరుతో కొండలు, గుట్టలను ఛిద్రం చేయడం వంటి దుశ్చర్యల ఫలితమే ఈ ఫలితం అని గుర్తించాలి. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లోని అటవీ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇది కేవలం వన్యమృగాల దూకుడు మాత్రమే కాదు, మనిషి దుందుడుకు చర్యలకు ప్రతిస్పందన కూడా! అ వన్యప్రాణుల వలసకు మూల కారణం మానవాభివృద్ధి తెచ్చిన దురాశ. దేశంలో 1951లో 40.4 శాతం అటవీప్రాంతం ఉండగా, ఇప్పుడది 21.7 శాతానికి తగ్గినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టులు, మైనింగ్, రోడ్లు, రియల్ ఎస్టేట్‌లు సహజ అడవులను మింగేస్తున్నాయి. దాదాపు 70 శాతం మంది భారతీయులు అడవులకు సమీపంలోనే నివసిస్తున్నారు.

మనిషి- వన్యప్రాణుల సంఘర్షణ వల్ల ప్రతి సంవత్సరం 500 మందికి పైగా మరణిస్తున్నారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇది వందలాది వన్యమగాల మరణాలకూ కారణమౌతోంది. 'భూమి మనందరి ఆస్తి కాదు'. కానీ మనం అడవులను సొంత 'ఆస్తి'గా భావిస్తూ విధ్వంసానికి పాల్పడుతుండటం వల్లే ప్రకృతి తిరుగుబాటు చేస్తోంది. ఇటీవల తెలంగాణ,తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు కొన్ని రోజుల పాటు కంటిమీద కునుకు లేకుండా చేసిందో పెద్దపులి. ఎట్టకేలకు అటవీశాఖ సిబ్బంది దానికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి పట్టుకున్నారు. తెలంగాణలోని జనగామ, సిద్ధిపేట జిల్లాల పరిధిలోనూ పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఇళ్లలోకి, పంట పొలాల్లోకి పులి తదితర జంతుజాలం వచ్చేస్తున్నాయి. ఏనుగులు సైతం పంట పొలాల్లోకి వచ్చి ధ్వంసం చేస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. నెమళ్లు వంటి అరుదైన పక్షులకూ భద్రత లేకుండాపోయింది. ఇది సహజ పర్యావరణ వ్యవస్థలను భంగపరచడంతో పాటు, జీవవైవిధ్యాన్ని నిర్వీర్యం చేస్తోంది. ఒక చెట్టు పడిపోతే పది చెట్లను నాటడం అలవాటు చేయాలి. ఇప్పుడు దేశానికి కావాల్సింది అటవీ సంరక్షణ, ప్రకృతి విధ్వంసం ఆపడం. అడవుల నరికివేతను అరికట్టాలన్న దృఢనిర్ణయం, మానవుల నుంచి రక్షణ కల్పించడం అన్నది ఉద్యమంగా సాగాలి. ప్రకృతి మనకు ఇచ్చిన బహుమతి అడవి. మనం దాన్ని కాపాడుకోవడం ద్వారా మనలను మనం రక్షించుకోవాలి. ప్రకృతిపై మనిషికి అధికారం లేదు. బాధ్యత మాత్రమే వుంది అన్న విషయాన్ని గుర్తించాలి. అప్పుడే వన్యప్రాణులకు రక్షణ ఉంటుంది.


# ఆ పదిమందిని బిఆర్ఎస్ ఆహ్వానించాలి !

**ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం అన్నది అనైతికమని అందరూ అనుకుంటున్నా..కాదని తేలిపోయింది. ఎవరు ఎటుపోయినా కిమ్మనకుండా ఉంటే మంచిది. దీనికోసం కోర్టులు, విచారణలు అవసరం లేదని తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపులు స్పష్టం చేశాయి. నిజానికి ఫిరాయింపులకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు.**

కాకపోతే దానికి రకరకాల పేర్లు పెట్టి పిలిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిఆర్ఎస్ అధినేతగా ఉన్న కెసిఆర్ ఆనాడు నిర్లజ్జగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలను

స్పీకర్‌కు సూచించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ రక్షకుడిని తానే అన్నంతగా రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని రాష్ట్రాలు తిరుగుతూ ఫొటోలకు పోజులిస్తుంటారు. మోడీ

అందుకే పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై వాదించే అధికారం బిఆర్ఎస్ నైతికంగా కోల్పోయింది. రాజకీయాల్లో కఠిన చట్టాలను తుంగలో తొక్కుతున్నదే ప్రజాప్రతినిధులు



అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయించారు. జర్మనీ పౌరసత్వం ఉన్న చెన్నమనేని రమేశ్‌ను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేసి కథ నడిపించారు. ఇవన్నీ అనైతికమైతే... పదిమంది పార్టీ మారడం కూడా అనైతికం అవుతుంది. లేదంటే చెల్లుకు చెల్లు అని సరిపెట్టుకోవాల్సిందే. ఇక ఎలాటూ ఆ పదిమంది తాము బిఆర్ఎస్‌లోనే ఉంటున్నామని చెప్పడం ద్వారా వారికి తిరిగి గులాబీ కండువా కప్పి తెలంగాణ భవన్‌లో సన్మానించాలి. ఇవన్నీ మరచి ఇప్పుడు తమ పార్టీకి చెందిన వారు కాంగ్రెస్‌లో చేరితే గగ్గోలు పెట్టారు. సుప్రీం తీర్పు, తరవాత స్పీకర్ తీర్పు దరిమిలా సమాజంలో పెద్దగా మార్పు కనిపించదు. ఎందుకంటే నైతికతకు తావులేని చోట తీర్పులు ఇలాగే ఉంటాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఇప్పుడు ఫిరాయింపులపై తేలిందంతే. ఎమ్మెల్యేలంతా తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారు. స్పీకర్ కూడా అదే చెప్పారు. కనుక ఈ పదిమంది ఎమ్మెల్యేలను స్వాగతించి, ప్రచారం చేసుకోవడం ద్వారా బిఆర్ఎస్ చతురత ప్రదర్శించాలి. ఆ పదిమందిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలి. అప్పుడు వారి రంగు తెలుస్తుంది. ఇకపోతే రాజ్యాంగానికి అన్యాయం జరిగిందంటూ. ఓట్ చోరీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనుంచి ఈ రకమైన అరుపులు మానేయాలి. రాజ్యాంగం ప్రకారం ముందు వారు నడవడం నేర్చుకోవాలి. రాహుల్ పార్లమెంట్‌లో ఒకమాట బయట మరోమాట మాట్లాడడం మానాలి. నీతిమాలిన రాజకీయాలను పక్కన పెట్టాలి . హర్యానాలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రయోగించి వెంటనే వారిపై అనర్హత వేటు వేయాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఫిరాయింపు చట్ట ప్రయోగానికి సాంకేతికత కంటే నైతికతే ప్రామాణికమని ఆ రాష్ట్ర శాసనసభ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందని అంటున్నారు. ఒక్క మోడీయే కాదు..దేశమంతా ఇలాగే తగులబడింది. అధికారానికి అలవాటు పడ్డ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా చేయలేవు. రాజ్యాంగ రక్షణ విషయంలో దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సాంకేతిక కారణాలను చూపుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గోడ దూకినట్టు నిర్ధారించేందుకు తగినన్ని భౌతిక ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు

బిఆర్ఎస్ కూడా నైతికత ప్రదర్శించాలి. ఈ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువా కప్పాలి. అప్పుడు వారు వస్తారా లేదా అన్నది వారి ఇష్టం లేదంటే బిఆర్ఎస్‌లోనే మరో గ్రూపుగా అయినా ఉండిపోతారు. నిజానికి గతంలో వేములవాడ ఎమ్మెల్యే విషయంలో బిఆర్ఎస్ కూడా అనైతికతకు పాల్పడింది. ఆయనకు జర్మనీ పౌరసత్వం ఉందని తెలిసినా కులగజ్జితో ఎమ్మెల్యేను చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సకల సౌఖ్యాలు అనుభవించారు. దీనిపై ఆనాడు ఫిర్యాదు వచ్చిన వెంటనే కెసిఆర్ స్పందించలేదు. ఈ వ్యవహారం కోర్టుల్లో తేలడానికి పదేళ్లు పట్టింది. అన్నది మరచిపోరాదు. ఫిరాయింపులపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపుదారులను విచారించి వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యాన్ని ఆక్షేపించారు. స్పీకర్ సాగదీత ధోరణిపై సుప్రీంకోర్టు ధర్మాసనం పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఫిరాయింపుపై మూడు నెలల్లో తేల్చాలని తొలుత జూలై 31న ఆదేశించింది. అక్టోబర్ 21తో గడువు ముగిసినా తేల్చక పోవడంపై కోర్టు సీరియస్ అయ్యింది. నవంబర్ 17న మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ కోర్టు ధికరణకు పాల్పడ్డారని సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలని, లేదా నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకోవాలను కుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నిజానికి సుప్రీం కనుక తన తీర్పును స్పీకర్ కోర్టులోకి నెట్టకుండా నేరుగా నిర్ణయం తీసుకుని తీర్పు ఇచ్చివుంటే పరిస్థితి మరోలా ఉండేది. పక్కా అఫిడవిట్లు, ఫొటోలు, బహిరంగ ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, అనేక నెలలుగా కాంగ్రెస్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని స్పష్టంగా నివేదించినా అవేవీ పరిగణనలోకి తీసుకోకుండా స్పీకర్ సాంకేతికంగా ఇప్పటికీ బీఆర్ఎస్‌తోనే ఉన్నారని పేర్కొనడంపై పెద్దగా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో వెలువడిన నిర్ణయం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. తమకు మాత్రం వ్యతిరేకమైన సందర్భాల్లో మాత్రమే స్పందించడం కాదు...ఎప్పుడూ ఒకేలా ఉండాలి. దీనికి భిన్నంగా ఏదో జరుగుతుందని కూడా ఎవరూ అనుకోవద్దు. ప్రజాజీవితంలో నైతిక విలువలు పూర్తిగా లుప్తమైన స్థితిలో ఇలాంటి అనైతికత ఓడుతుందని నైతికత గెలుస్తుందనీ ఎదురుచూడటం అత్యాశే అవుతుంది.


## గన్నవరంలో వంశీకి కలిసొచ్చేనా



గన్నవరం రాజకీయాలు మళ్లీ గరం గరంగా మారనున్నాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తిరిగి గన్నవరం పాలిటిక్స్ లో యాక్టివ్ అయ్యారు. దాదాపు రెండేళ్ల పాటు గన్నవరం రాజకీయాలకు దూరంగా ఉన్న వల్లభనేని వంశీ తాజాగా ఇప్పుడు తిరిగి తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వల్లభనేని వంశీ తిరిగి యాక్టివ్ కావడంతో అక్కడ వైసీపీ కార్యక్రమాలు కూడా ఊపందుకున్నాయి. గన్నవరం నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వల్లభనేని వంశీ గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తర్వాత కొన్ని నెలల పాటు జైల్లో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వల్లభనేని వంశీ రూపు రేఖలు కూడా జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత మారిపోయాయి.ఇప్పటికీ అదే రకంగా వల్లభనేని వంశీ మెయిన్ టెయిన్ చేస్తున్నారు. గతంలో యువకుడిగా కనిపిస్తూ, జట్టుకు రంగు వేసుకుని కనిపించే వల్లభనేని వంశీ గత కొద్ది రోజుల నుంచి మాత్రం తెల్లజుట్టు, బక్కపలచగానే ఉన్నారు. అది కేవలం సెంటిమెంట్ తోనే వంశీ జనంలోకి వెళ్లి సింపతీని పొందాలనుకుంటున్నట్లుంది. అందుకే ఆయన తన రూపు రేఖలను మార్చుకునే ప్రయత్నం చేయడం లేదు. వల్లభనేని వంశీని గతంలో , ఇప్పుడు చూసిన వారికి పాపం.. అనిపించేలా వంశీ ఉండటం ఆయనకు కలసి వచ్చే అంశమని చెబుతున్నారు. జైల్లో 140 రోజుల పాటు ఉన్న వల్లభనేని వంశీ తెల్ల జుట్టుతో పాటు అనేక ఆరోగ్య పరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వచ్చే ఎన్నికల వరకూ ఇదే రకంగా మెయిన్ టెయిన్ చేసి తిరిగి గెలుపొందేలా ప్లాన్ చేసుకున్నారని తెలిసింది.వల్లభనేని వంశీ ఇటీవల వరసగా అనేక వివాహ వేడుకలకు హాజరయ్యారు. అక్కడ టీడీపీ నేతలను కూడా పలుకరించడం, ఆత్మీయంగా దగ్గరకు తీసుకోవడం చర్చనీయాంశమైంది. వివాహ వేడుకలలో మాత్రమే కాకుండా అనేక కార్యక్రమాలకు కూడా ఆయన హాజరవుతున్నారు. గన్నవరం నియోజకవర్గంలో వల్లభనేని వంశీ విస్తృతంగా పర్యటిస్తున్నారు. వైసీపీ కార్యకర్తలకు ధైర్యం చెబుతున్నారు. తాను ఎక్కడకూ వెళ్లనని, ఇక్కడే ఉండి రాజకీయాలను కొనసాగిస్తానని చెబుతున్నారు.

## పరకామణి, కల్తీ నెయ్యి, పట్టు శాలువాలు

ఏడుకొండల వాడు, వడ్డీకాసుల వాడు..కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో..నిత్యం ఏదో ఒక ఇష్యూ సంచలనం సృష్టిస్తూనే ఉంది. ఇప్పటికే కల్తీ నెయ్యి, పరకామణి చోరీ ఎపిసోడ్ కొండంత వివాదంగా ఉండగా..ఈ మధ్యే పట్టు శాలువాల స్కామ్ అంటూ దుమారం లేచింది. ఈ ఇష్యూ అలా చల్లారిందో లేదో..ఇప్పుడు ఇంకో వివాదం వెలుగులోకి వచ్చింది. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ విమాన గోపురం బంగారు తాపడం పనులపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది.గోవిందరాజస్వామి ఆలయంలో 50 కిలోల బంగారం మాయం చేశారన్న ప్రచారం సెన్సేషనల్ అవుతోంది. విమాన గోపురం బంగారం తాపడం పనులకు గత ప్రభుత్వం 100 కిలోల బంగారం కేటాయించగా..అందులో 50 కేజీల గోల్డ్‌ను మాయం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. 9 లేయర్లతో బంగారం తాపడం వేయాల్సి ఉండగా 2 లేయర్లే వేశారన్న టాక్ వినిపిస్తోంది. బంగారం తాపడం పనులు అసలు కాంట్రాక్టర్ కాకుండా సబ్ కాంట్రాక్టర్ నిర్వహించారన్న చర్చ జరుగుతోంది. ఆలయ గోపురంపై అప్పట్లో 30పైగా విగ్రహాలు ధ్వంసం చేసి బంగారం తాపడం పనులు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అవకతవకలపై చాలా సీక్రెట్‌గా విజిలెన్స్ విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది.లేటెస్ట్



వ్యవహారంపై మరోసారి తిరుమల శ్రీవారి సెంట్రిక్‌గా తీవ్ర దుమారం నడుస్తోంది. గోవిందరాజస్వామి ఆలయ గోపుర తాపడం కోసం కేటాయించిన బంగారంలో గోల్‌మాల్ జరిగిందన్న ప్రచారం పొలిటికల్ కాంట్రవర్సీ అవుతోంది. ఇప్పటికే కల్తీ నెయ్యి ఎపిసోడ్ నేషనల్ టాపిక్ అయింది. దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసి..హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చేసింది. ఆ తర్వాత పాత ఇష్యూ పరకామణి చోరీ కేసు కలకలం సృష్టించింది. ఫిర్యాదుదారుడు, సాక్షిగా ఉన్న ఆఫీసర్ అనుమానాస్పద మృతి చెందడంతో కూటమి వర్సెస్ వైసీపీ డైలాగ్ వార్‌కు దారితీసింది.ఇక శ్రీవారి పట్టువస్త్రాల స్కామ్ కూడా హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు గోవిందరాజస్వామి ఆలయ తాపడం వ్యవహారంతో మరోసారి తిరుమల చుట్టే చర్చ జరుగుతోంది. ఏడాది కాలంలోనే నాలుగు అంశాలు శ్రీవారి భక్తుల మనసును గాయపరిచాయి. కల్తీ నెయ్యి, పరకామణి కేసులో వైసీపీ నేతలు, అప్పటి టీటీడీ ఈవోలు అలిగేషన్స్ ఫేస్ చేస్తున్నారు. పట్టు శాలువాల వ్యవహారంలో విజిలెన్స్ దర్యాప్తు ఉత్కంఠ రేపుతోంది. గోవిందరాజ స్వామి ఆలయ గోపురం తాపడం తయారీలో..50 కిలోల బంగారం చోరీ అయినట్లు ప్రచారం జరుగుతుండటం సంచలనం సృష్టిస్తోంది.

# కుష్బూ వారసురాలిద్దరూ రెడీ..



ఉత్తరాది నుంచి దక్షిణాదికి దిగుమతి అయిన నటి కుష్బూ హిందీలో బాల నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ సంచలన నటి ఆ తరువాత తెలుగులో వెంకటేష్‌కు జంటగా కలియుగ పాండవులు చిత్రంలో కథానాయికిగా పరిచయమయ్యారు. ఆ తరువాత వరుషం--16 చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చారు. విశేషం ఏమిటంటే ఈమె తెలుగు, తమిళం భాషల్లో నటించిన రెండు చిత్రాలు విజయం సాధించాయి. ఆ తరువాత ఈ రెండు భాషల్లోనూ పలు చిత్రాల్లో నటించారు. తమిళంలో రజనీకాంత్, కమలహాసన్, విజయకాంత్, ప్రభు, కార్తీక్ వంటి నటులతో జంటగా నటించారు. కథానాయకిగా బిజీగా ఉండగానే దర్శకుడు సుందర్.సి ని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ తరువాత రాజకీయ రంగప్రవేశం చేసి ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రచార కర్తగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. మరో పక్క నిర్మాతగా చిత్రాలు నిర్మిస్తున్నారు. సుందర్.సి, కుష్బూ దంపతులకు అవంతిక, ఆనందిత అనే ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఇప్పుడు వారు కూడా సినీ రంగప్రవేశం చేయడం విశేషమేమీ కాదు. చిన్న కూతురు ఆనందిత దర్శకుడు మణిరత్నం వద్ద సహాయ దర్శకురాలిగా చేరారు. పొన్నియిన్ సెల్వన్ 1, 2, థగ్‌లైఫ్ చిత్రాలకు పని చేశారు. పెద్ద కూతురు అవంతిక హీరోయిన్‌గా రంగప్రవేశం చేశారు. ఈమె లండన్‌లో నటనలో శిక్షణ పొందారన్నది గమనార్హం. ఇటీవల ఒక వాణిజ్య ప్రకటనలో నటించి తల్లి కుష్బూ ప్రశంసలు అందుకున్నారు. తాజాగా ఆరంభం అనే మలయాళ చిత్రంలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో సరిత మరో ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. సురేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ తాజాగా ప్రారంభమైంది. అవంతిక త్వరలో తమిళ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ అవుతారని ఆశించవచ్చు.

# కాన్సెప్ట్ బాగుంది కానీ... అందులో వాస్తవం లేదు: దర్శకుడు క్రిష్



దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తదుపరి మూవీ అడ్వెంచర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనుందని, అందులో ఏడుగురు హీరోయిన్లు నటించనున్నారనే వార్తలు ఇటీవల సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఈ ప్రచారంపై స్పందించిన క్రిష్.. ఏడుగురు హీరోయిన్లు, ట్రెక్కింగ్ అడ్వెంచర్.. ఐడియా బాగుంది, కానీ ఇది నిజం కాదని అన్నారు. సోషల్ మీడియాలో పుట్టిన మరో స్క్రిప్ట్ మాత్రమేనంటూ వదంతులకు తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టారు. తన కొత్త సినిమా వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తానని చెప్పారు. గమ్యం మూవీతో దర్శకుడిగా పరిచయమైన క్రిష్, ఆ మూవీతో తెలుగు ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని అందించిన సంగతి తెలిసిందే. తరువాత వేదం, కృష్ణం వందే జగద్గురుమ్ వంటి ఆలోచనాత్మక చిత్రాలు, అలాగే కథానాయకుడు (ఎన్టీఆర్) వంటి బయోపిక్‌ను తెరకెక్కించారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన హరి హర వీరమల్లు, ఘాటి మూవీలు గత ఏడాది విడుదలయ్యాయి.



# లొకేషన్‌లో వాగ్వివాదం


షూటింగ్ టైమ్‌లో క్రియేటివ్ డిఫరెన్స్ కామన్. డైరెక్టర్‌కీ డీవోపీకీ మధ్య ఈ విషయంలో గొడవలెక్కువగా వస్తుంటాయి. మూవీ మేకింగ్‌పై నిర్మాతకు అవగాహన ఉంటే కూడా సెట్‌లో వాదనలకు ఆస్కారం ఉంటుంది. ఈ మధ్య సెట్స్‌లో హీరోల జోక్యం కూడా ఎక్కువైందని, కొందరు హీరోలైతే డైరెక్టర్లకీ, డీవోపీలకూ షాట్ ఎలా పెట్టాలో కూడా చెబుతున్నారనీ ఇన్‌సైడ్ టాక్.. ఈ విషయంలో బాలీవుడ్ రెండాకులు ఎక్కువే చదివింది. అక్కడ హీరోయిన్లు కూడా జోక్యం చేసేసుకుంటున్నారట. వివరాల్లోకెళ్తే. యష్‌రాజ్ ఫిల్మ్స్ పతాకంపై లేడీ స్పై థ్రిల్లర్‌గా 'ఆల్ఫా' సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అలియాభట్ లీడ్‌రోల్ చేస్తున్నది. శివ్‌రావెల్ దర్శకుడు. ఈ సినిమా షూటింగ్‌లో అలియాభట్ జోక్యం అధికమవ్వడంతో లొకేషన్‌లో పెద్ద గొడవే జరిగిందట. లొకేషన్‌లో దర్శకుడు శివ్‌రావెల్‌కు క్రియేటివ్ అవుట్‌పుట్స్‌ని అలియా ఎక్కువగా ఇస్తుండటం అసలు గొడవకు కారణమైందని వినికిడి. యాదృశ్చికంగా బాబీడియోల్ కాంబినేషన్ సీన్స్ తీస్తున్నప్పుడు కూడా ఇది జరిగిందట. ఈ విషయంలో కొంతవరకూ బాబీడియోల్ సర్దుకుపోయినా.. వ్యవహారం శృతి మించడంతో అభ్యంతరం తెలియజేయక బాబీడియోల్‌కి తప్పిందికాదు. దాంతో ఇద్దరి మధ్య ఓ స్థాయిలో వాగ్వివాదం జరిగిందట. ఈ గొడవను చల్లార్చి, షూటింగ్‌ను సజావుగా నడిపించేందుకు దర్శక,నిర్మాతలు చాలా కష్టపడాల్సివచ్చిందట. ప్రస్తుతం బాలీవుడ్ మీడియాలో ఈ విషయంపై కథనాలు వెలువడుతున్నాయి. 'అల్ఫా' సినిమా విషయంలో అలియా అధికంగా జోక్యం చేసుకోవడానికి కారణం యష్‌రాజ్ ఫిల్మ్స్ గత చిత్రాలైన వార్ 2, మర్దానీ 3 చిత్రాల ఫలితాలేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.






# సీతతో విడిపోయిన తర్వాత చాలా సంతోషంగా ఉన్నా: పార్తీబన్

సినీ నటి సీత, దర్శకుడు, నటుడు పార్తీబన్ 1990లో ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. దాదాపు 12 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత ఇద్దరూ విడిపోయారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు ఒక కుమారుడిని దత్తత తీసుకున్నారు. విడిపోయినప్పటి నుంచి పార్తీబన్ ఒంటరిగానే ఉంటున్నారు. సీత మాత్రం మరొక వ్యక్తిని పెళ్లాడి, ఆ తర్వాత ఆయనతో కూడా విడిపోయారు. సీతతో తన వివాహం, విడిపోవడంపై పార్తీబన్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... సీతతో విడిపోయినందుకు తాను ఎప్పుడూ బాధపడలేదని చెప్పారు. నిజం చెప్పాలంటే ఆమెతో విడాకులు తీసుకున్న తర్వాత చాలా సంతోషంగా ఉన్నానని తెలిపారు. అయితే, ఆమెతో ఉన్న 12 సంవత్సరాలు తన జీవితంలో మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయిందని చెప్పారు. ఈ రోజుల్లో పురుషులు కానీ, మహిళలు కానీ వివాహం చేసుకోవడం కంటే స్వతంత్రంగా ఉండానికే ఇష్టపడతారని... ఏ మహిళ కూడా వివాహం పేరుతో పరిమితులు ఉండే జీవితాన్ని కోరుకోదని తెలిపారు. పార్తీబన్ చేసిన ఈ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.



# వారణాసి ఏ జానర్ మూవీ?... రాజమౌళి సమాధానం ఇదే!

దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'వారణాసి'పై ఆసక్తి రోజు రోజుకీ పెరుగుతోంది. హీరోగా మహేశ్ బాబు నటిస్తుండగా, ఈ చిత్రం ఏ జానర్‌కు చెందిందన్న దానిపై వివిధ ఊహాగానాలు వినిపించాయి. టైటిల్ గ్లింప్స్ విడుదలైన తర్వాత కథపై మరింత ఆసక్తి పెరిగింది. ఇక ఆటోమేటిక్ వీల్‌చైర్‌లో విలన్ పాత్రలో కనిపించిన పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్‌లుక్ ఆధారంగా ఇది సైన్స్ ఫిక్షన్ సినిమా అంటూ ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారానికి స్వయంగా రాజమౌళి క్లారిటీ ఇచ్చారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. 'వారణాసి'కి సైన్స్ ఫిక్షన్ ఫీల్ ఉన్నా, ఇది ఆ జానర్ సినిమా కాదని స్పష్టం చేశారు. ఇది ఫాంటసీ --మైథలాజికల్ మూవీ అని వెల్లడించారు. ఆర్ఆర్ఆర్ విజయంతో ఎలాంటి ఒత్తిడి లేదని రాజమౌళి తెలిపారు. కొత్త సినిమా ప్రారంభించినప్పుడు గత చిత్రాల ఫలితాలను దృష్టిలో పెట్టుకోనన్నారు. రుద్ర పాత్రలో వృషభంపై మహేశ్ ఎంట్రీ 'వారణాసి'లో గ్రేటెస్ట్ సినిమాటిక్ మూమెంట్ అవుతుందన్నారు. దర్శకుడిగా ప్రేక్షకులకు ఎప్పుడూ కొత్త అనుభూతి ఇవ్వాలనుకుంటానని తెలిపారు. అది కేవలం విజువల్స్ పరంగానే కాదు, భావోద్వేగాల పరంగానూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మూవీ రన్‌టైమ్ మూడు గంటల కంటే తక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నానన్నారు. పూర్తి సినిమాను ఐమ్యాక్స్ వెర్షన్‌లో తెరకెక్కించాలని భావించినప్పటికీ, కొన్ని పరిమితుల కారణంగా కొన్ని సన్నివేశాలనే ఆ ఫార్మాట్‌లో రూపొందిస్తున్నామని తెలిపారు. రామాయణం ఎపిసోడ్ షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, దానికి సంబంధించిన వీఎఫ్ఎక్స్ పనులు సవాలుగా ఉన్నాయని చెప్పారు. ఈ భారీ ప్రాజెక్ట్ 'వారణాసి' 2027 ఏప్రిల్ 7 న ప్రేక్షకుల ముందుకు రానుంది.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.